


గిద్దలూరు ఏరియా వైద్యశాల పరిధిలో ఇటీవల కాలంలో 10 మంది గుండెపోటుకు గురయ్యారు. అక్కడి వైద్యులు టెనెక్టెప్లెస్ ఇంజక్షన్ ఇవ్వడంతో ఐదుగురు ప్రాణాలతో బయటపడ్డారు. ముగ్గురు ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి సర్జరీలు చేయించుకొన్నారు. మరో ఇద్దరు మృత్యువాతపడ్డారు.

దర్శి మండలం సామంతపూడికి చెందిన పమిడి రామయ్య (70) ఈనెల 8వ తేదీ రాత్రి 8.30 గంటలకు గుండెపోటుకు గురయ్యారు. తక్షణమే స్థానిక సీహెచ్‌సీకి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి టెనెక్టెప్లెస్ ఇంజక్షన్ వేశారు. అనంతరం ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు స్టంట్‌వేసి ప్రాణాలు నిలిపారు.

పదిలంగుండెలా..

హార్ట్‌స్ట్రోక్ మరణాల రేటును తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు



టెనెక్టెప్లెస్ ఇంజక్షన్

- రూ.40వేల విలువైన టెనెక్టెప్లెస్ ఇంజక్షన్ సర్కారు వైద్యశాలల్లో ఉచితం
- ఉమ్మడి జిల్లాలో 17చోట్ల అందుబాటులోకి
- స్టెమీ యాప్‌లో వివరాలు నమోదు
- కార్డియాలజిస్టుల సూచనతో ఇంజక్షన్
- కొద్దిరోజుల్లోనే 78 మంది ప్రాణాలు కాపాడిన ప్రభుత్వం

ఒకప్పుడు 50 ఏళ్ల పైబడిన వాళ్లకు వచ్చే గుండెపోటు ఇప్పుడు యుక్త వయస్కుల్లోనూ వస్తోంది. ప్రాణాలను హరించేస్తోంది. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. దీన్ని నివారించేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. గుండెపోటు మరణాలను తగ్గించే చర్యలకు ఉపక్రమించింది. రూ.40వేల విలువైన టెనెక్టెప్లెస్ ఇంజక్షన్‌ను ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా అందిస్తోంది. గుండెపోటుకు గురైన వ్యక్తికి తొలి గంటలో ఈ ఇంజెక్షన్ ఇచ్చి ప్రాణాపాయం నుంచి గట్టెక్కిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని 17 ప్రభుత్వ వైద్యశాలల్లో ఈ ఇంజెక్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటి వరకు ఆయా వైద్యశాలలకు 121 ఇంజక్షన్లు కేటాయించగా 78 మందికి వాటిని వినియోగించి ప్రాణాలు కాపాడారు.

ఒంగోలు కలెక్టరేట్/చీమకుర్తి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుకు గురైన వారికి తొలి గంట సమయం ఎంతో విలువైనది. దీన్ని గోల్డెన్ అవర్ అంటారు. ఈలోపు టెనెక్టెప్లెస్ ఇంజక్షన్ ఇస్తే రక్తం గడ్డ కట్టకుండా ఉంటుంది. బాధితులను ప్రాణాపాయం నుంచి తప్పించి మెరుగైన వైద్యం అందించేందుకు సమయం లభిస్తుంది. రూ.40వేల వరకూ ఉండే ఈ ఇంజక్షన్‌ను ఇప్పుడు ప్రభుత్వం సర్కారు వైద్యశాలల్లో ఉచితంగా ఇస్తోంది. టెనెక్టెప్లెస్ ఇంజక్షన్‌ను కమ్యూనిటీ వైద్యశాలల్లో (సీహెచ్‌సీల్లో) అందుబాటులోకి తెచ్చింది.

స్టెమీ యాప్‌లోనే వివరాలు

ఎవరైనా గుండెపోటుకు గురైనప్పుడు 108కు ఫోన్‌చేసి వివరాలు తెలియచేస్తే సమీప సీహెచ్‌సీకి బాధితులను తరలిస్తారు. అక్కడి సిబ్బంది వారికి ఈసీజీ తీస్తారు. ఆ వివరాలను వెంటనే స్టెమీ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. దాన్ని ఒంగోలులోని సర్వజన ఆస్పత్రిలో ఉన్న కార్డియాలజిస్టులు పరిశీలిస్తారు. వారి సూచన మేరకు గుండెపోటుకు గురైన వ్యక్తికి టెనెక్టెప్లెస్ ఇంజక్షన్ ఇస్తారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అన్ని వసతులతో కూడిన వైద్యశాలకు తరలిస్తారు. టెనెక్టెప్లెస్ ఇంజక్షన్లను ఉమ్మడి జిల్లాలోని 17 ఆస్పత్రుల్లో ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.

పర్యవేక్షణకు నోడల్ అధికారి

ఖరీదైన ఈ ఇంజక్షన్లు పక్కదారి పట్టకుండా ఉండేందుకు ప్రభుత్వం స్టెమీ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌ను పరిశీలించేందుకు ఒక నోడల్ అధికారిని కూడా నియమించారు. ఆయన ఇంజక్షన్ల వినియోగం, నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు.

ఉమ్మడి జిల్లాలో ఇంజక్షన్ ఉన్న ఆస్పత్రులివే..

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కందుకూరు, గిద్దలూరు, దోర్నాల, మార్కాపురం, అద్దంకి, చీమకుర్తి, కంభం, దర్శి, దోర్నాల, కనిగిరి, కొండపి, మార్టూరు, పామూరు, పొదిలి, ఉలవపాడు, యర్రగొండపాలెం, పర్చూరులోని ప్రభుత్వ వైద్యశాలల్లో టెనెక్టెప్లెస్ ఇంజక్షన్‌ను అందుబాటులో ఉంచారు. ఇప్పటి వరకు ఆయా వైద్యశాలలకు 121 ఇంజక్షన్లు కేటాయించగా 78 మందికి వాటిని వినియోగించారు. మరో 43 అందుబాటులో ఉన్నాయి.



జీబీఎస్ కలకలం

- అలసందలపల్లికి చెందిన మహిళ మృతి
- జిల్లాలో ఇదే తొలి కేసు

- అప్రమత్తమైన యంత్రాంగం
- గ్రామంలో అధికారుల సందర్శన
- రెండు వైద్యశిబిరాల ఏర్పాటు
- అనుమానితులకు పరీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గులియన్ బారీ సిండ్రోమ్ (జీబీఎస్) కలకలం రేగింది. కొమరోలు మండలంలోని దద్దవాడ పంచాయతీ పరిధి అలసందలపల్లి గ్రామానికి చెందిన కమలమ్మ (50) అనే వ్యవసాయ కూలీ ఈ మహమ్మారి బారిన పడి మృతి చెందారు. కమలమ్మ ఈనెల 2వ తేదీ రాత్రి ఒక్కసారిగా అనారోగ్యం బారిన పడ్డారు. ఆమె విపరీతమైన కండరాలు, ఒళ్లు నొప్పులతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు తొలుత గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం డాక్టర్ల సూచన మేరకు ఈనెల 3వతేదీన గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు చేయగా కమలమ్మ జీబీఎస్ బారిన పడినట్లు తేలింది. అప్పటి నుంచి గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న కమలమ్మ ఆదివారం మృతి చెందారు. ఈమేరకు కలెక్టర్‌కు అక్కడి నుంచి సమాచారం అందింది.


అలసందలపల్లిలో డీపీవో వెంకటనాయుడు, వైద్యాధికారులు

కలుషిత నీరే కారణం

జీబీఎస్ వ్యాధి నీటి వనరుల్లో జంతువులు, పశువుల మలమూత్ర వ్యర్థాలు, జంతు కళేబరాల కలిసి ఆ కలుషిత నీటిని తాగడం వలన వస్తుంది. దీని బారిన పడిన వారికి విపరీతమైన కండరాల నొప్పులు మొదలవుతాయి. అనంతరం నరాలు, ఇతరత్రా శరీర భాగాలపై ప్రభావం చూపుతుంది. చివరకు ఊపిరితిత్తులు కూడా దెబ్బతిని శ్వాస తీసుకోవడం కూడా ఇబ్బంది అవుతుంది. అనంతరం రోగి కోమాలోకి వెళ్లి మృత్యువాతపడతారు. కలుషిత నీటిని తాగకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దీని బారిన పడకుండా ఉండొచ్చు.



గ్రామాన్ని సందర్శించిన డీపీవో

డీపీవో వెంకటనాయుడు ఆదివారం అలసందలపల్లికి వెళ్లి కమలమ్మ గృహాన్ని సందర్శించారు. గ్రామంలో సూపర్ క్లోరినేషన్ నిర్వహించారు. డీపీవోతోపాటు ఎంపీడీవో సయ్యద్ మస్తాన్‌వలి, ఈవోపీఆర్‌డీ బ్రహ్మయ్య, కార్యదర్శి రమణ, రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కజియా బాను, హసీనారాణి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గ్రామంలోని వాటర్ ట్యాంకులను, బోర్లను, ఇంటిపైన ఉన్న ట్యాంకులను పరిశీలించి క్లోరినేషన్ చేయించారు. పశువులను పెంచే ప్రదేశాల్లోనూ, మురికి కాలువల్లో బ్లీచింగ్ చల్లించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారులు గ్రామంలో రెండు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. జ్వర బాధితులకు రక్తపరీక్షలు చేస్తున్నారు. సమీప గ్రామాలను అప్రమత్తం చేశారు.

వేటగాళ్ల ఉచ్చులో పడి చిరుత మృతి

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 16 : వేటగాళ్ల ఉచ్చులో పడి చిరుత మృతిచెందింది. ఈ ఘటన నల్లమల అడవిలోని ఎర్రగొండపాలెం ఫారెస్ట్ రేంజ్ పరిధి కొలుకుల బీట్‌లో చోటుచేసుకొంది. గంజివారిపల్లె ఫారెస్టు రేంజర్ సుబ్బారావు దీన్ని ధ్రువీకరించారు. ఈ చిరుత వయస్సు మూడేళ్లు ఉంటుందన్నారు. కళేబరానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు తెలిపారు.

18న ఏడుగుండ్లపాడులో రచ్చబండ



- క్యాన్సర్‌పై ప్రజలతో ముఖాముఖి
- పాల్గొననున్న మంత్రి సత్యకుమార్, సినీనటి గౌతమి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడు గ్రామంలో ఈనెల 18వతేదీన జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై ముఖాముఖి ఏర్పాటు చేశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, సినీనటి గౌతమి పాల్గొననున్నారు. ప్రస్తుతం జిల్లాలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ సమయంలోనే వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ముఖాముఖి (రచ్చబండ) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఏర్పాట్లను ఆదివారం డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వర్లు పరిశీలించారు.


ఒంగోలులో ఖాళీగా దర్శనమిస్తున్న చికెన్ దుకాణం

చికెన్ ఢమాల్!

- కోడి మాంసం కొనుగోలుకు ప్రజల వెనుకంజ
- బర్డ్ ఫ్లూతో కిలోకు రూ.50 తగ్గిన ధరలు
- దుకాణాల వద్ద పెద్దగా కనిపించని జనం
- మటన్, చేపలకు పెరిగిన డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : బర్డ్ ఫ్లూ ప్రభావం చికెన్ వ్యాపారంపై పడింది. దాని భయంతో ప్రజలు కోడి మాంసం అంటేనే హడలిపోతున్నారు. ఫలితంగా అమ్మకాలు భారీగా పడిపోయాయి. ధరలు కూడా తగ్గాయి. సాధారణంగా ఆదివారం వచ్చిందంటే జిల్లా కేంద్రమైన ఒంగోలులో చికెన్ అమ్మకాలు జోరుగా జరుగుతాయి. పాత మార్కెట్, కొత్త మార్కెట్ సెంటర్‌లలో సుమారు 50కిపైగా చికెన్ దుకాణాలు ఉన్నాయి. ఆ ప్రాంతాల్లో ఆదివారం వచ్చిందంటే కొనుగోలుదారులతో రద్దీ ఉంటుంది. కానీ ఈ వారం అందుకు పూర్తిభిన్నమైన పరిస్థితి నెలకొంది. జనం పలుచగా కన్పించారు.



కిలోకు రూ.50 వరకూ తగ్గిన ధర

గత వారంతో పోల్చుకుంటే ఈ ఆదివారం చికెన్ ధరలు కూడా తగ్గాయి. గత వారం కిలో రూ.250 నుంచి 260 ఉండగా ఈ వారం కిలో రూ.210కి పడిపోయింది. అంటే వారం వ్యవధిలో రూ.50 వరకూ తగ్గింది. ఇంకోవైపు అమ్మకాలు కూడా సగానికి పైగా పడిపోయాయి. కొత్త మార్కెట్ సెంటర్‌లోని ఒక హోల్‌సేల్ షాపులో ఒక్క ఆదివారం రోజు సుమారు పది వేల కిలోలకుపైగా విక్రయాలు జరుగుతాయి. అక్కడ కొనుగోళ్ల కోసం ప్రజలు క్యూలో ఉంటారు. ఈవారం అక్కడ ఐదువేల కిలోలు కూడా విక్రయించలేకపోయారు.

పౌల్ట్రీలను పరిశీలించిన అధికారులు

జిల్లాలోని తాళ్లూరు, ముండ్లమూరు దర్శి, కనిగిరి, మద్దిపాడు, కొత్తపట్నం మండలాల్లో పౌల్ట్రీలు ఉన్నాయి. వాటిని పశుసంవర్థకశాఖ అధికారులు పరిశీలించి యజమానులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఆదివారం ఒంగోలులో మటన్, చేపల కొనుగోళ్లు పెరిగాయి. ప్రధానంగా ఒంగోలులో చేపలమార్కెట్‌లో రద్దీ నెలకొంది. దీన్నిబట్టి విక్రయాలు ఏస్థాయిలో జరిగాయో అర్థమవుతుంది.

ఆబాల గోపాలం..

ఉత్సాహంగా బాలోత్సవం

ఒంగోలులో ఆదివారం బాలోత్సవం ఉత్సాహంగా సాగింది. దీనికి స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం వేదికైంది. జిల్లావ్యాప్తంగా సుమారు 5 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. సాంస్కృతిక, కళా, విద్యా, వైజ్ఞానిక విషయాలు, వ్యాసరచన, పద్యం, కథలు చెప్పడం, కోలాటం, లఘునాటికలు, జానపద నృత్యాలు, ఏకపాత్రాభినయం వంటి 54 విభాగాల్లో తమ ప్రతిభను చాటారు.




ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

- పల్నాడు జిల్లా నెమలిపురి వద్ద ప్రమాదం
- తల్లీ, ఇద్దరు కుమారులు మృతి
- వారు జిల్లాలోని పెద్దకొత్తపల్లి వాసులు
- హైదరాబాద్ నుంచి సీమంతం కోసం వస్తుండగా ఘటన

మృత్యు ట్యాంకర్

మద్దిపాడు/రాజుపాలెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వారంతా ఒకే కుటుంబానికి చెందినవారు. హైదరాబాద్‌లో పిల్లలు ఉద్యోగం చేస్తున్నారు. వారి వద్దే తల్లి ఉంటోంది. ఇటీవల ఆమె భర్తకు కిడ్నీ ఇచ్చి ఆయన్ను బతికించుకుంది. కుమారులిద్దరితో కలిసి పెద్ద కోడలి సీమంతం కోసం హైదరాబాద్ నుంచి కారులో స్వగ్రామమైన మద్దిపాడు మండలం పెదకొత్తపల్లికి బయల్దేరింది. మార్గమధ్యలో ట్యాంకర్ రూపంలో ముగ్గురినీ మృత్యువు కబళించింది. ఈ ఘటన అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం నెమలిపురి వద్ద చోటుచేసుకుంది. పెదకొత్తపల్లి గ్రామానికి చెందిన షేక్ నజీమ(46)కు భర్త, ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు షేక్ నూరుల్లా (26), చిన్న కుమారుడు షేక్ హబీబుల్లా (24) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నారు. ఈ క్రమంలో నూరుల్లా భార్య నబ్సిన్ గర్భిణి కావడంతో సీమంతానికి హైదరాబాద్ నుంచి సొంత కారులో కుమారులిద్దరితో కలిసి బయల్దేరారు. ఆదివారం తెల్లవారుజామున నెమలిపురి వద్దకు వీరు చేరుకునే సరికి ఎదురుగా వస్తున్న సిమెంట్ ట్యాంకర్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఆపై అతివేగంగా వచ్చి కారుపై పడింది. దీంతో కారు నుజ్జునుజ్జయ్యింది. అందులో ఉన్న నజీమ, హబీబుల్లా అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన నూరుల్లాను చికిత్స నిమిత్తం నరసరావుపేట తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై రాజుపాలెం ఎస్‌ఐ వేణుగోపాల్ కేసు నమోదు చేశారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ కంచి శ్రీనివాసరావు, డీటీవో సంజయ్‌కుమార్ పరిశీలించారు. మృతదేహాలు ఆదివారం రాత్రికి పెదకొత్తపల్లికి చేరాయి. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.


మృతులు షేక్ నూరుల్లా, షేక్ హబీబుల్లా(ఫైల్)


పెదకొత్తపల్లికి చేరిన మృతదేహాలు

కార్పొరేషన్‌లో నీటి ట్యాంకర్ల రగడ

- రూ.3.2కోట్ల బిల్లుల పెండింగ్
- కొత్త ట్యాంకర్లకు అనుమతుల మంజూరులో జాప్యం
- రెండు రోజుల క్రితం నీటిని నిలిపేసిన వైనం
- కాలనీల్లో తాగునీటికి ఇబ్బందులు



రెండు రోజుల క్రితం నిలిచిన ట్యాంకర్లు (ఫైల్)

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాలో రగడ చోటు చేసుకుంది. బిల్లులు చెల్లింపుల్లో కార్పొరేషన్ నిర్లక్ష్యం కనిపిస్తుండగా, నిర్వహణ మా వల్ల కాదంటూ ట్యాంకర్లను కాంట్రాక్టర్లు నిలిపివేయడం ఒకటైతే.. కొత్త టెండర్ పూర్తయ్యాక ఆర్డర్ కాపీ ఇవ్వడంలో అధికారుల వైపు నుంచి జాప్యం జరగడంతో మరో రోజు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో నగరంలోని పలు శివారు కాలనీలకు నీటి సరఫరా ఆగిపోయింది. సమస్య ప్రజాప్రతినిధి వద్దకు వెళ్లడం, సదరు కాంట్రాక్టర్‌కు హెచ్చరికలు చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇదేక్రమంలో టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఏడుకొండలు ఇంటికి కరెంట్ నిలిపివేయడం, కొళాయి తొలగించే ప్రయత్నం జరగడంతో ఇప్పుడంతా కార్పొరేషన్‌లో చర్చనీయాంశంగా మారింది.

అధికారుల వైఫల్యం..

తాగునీటి నిర్వహణలో కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నది. ప్రజల తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాల్సి అధికారులు నగరంలో తాగునీటికి పైపులైన్లు ఉండగా, శివారు కాలనీల్లో నేటికి లేవు. గడిచిన ఐదేళ్ల వైసీపీ హయాంలో శివారు కాలనీల వైపు దృష్టి సారించలేదు. దీంతో నగరంలోని శివారుకాలనీల్లో తాగునీటికి కష్టాలు సర్వసాధారణమయ్యాయి. ప్రతి 45 రోజులకు ఒకసారి టెండర్లు పిలిచి, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ వాటికి బిల్లులు చెల్లించే విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై సంబంధిత ట్యాంకర్‌ల కాంట్రాక్టర్లు అప్పులతో నిర్వహణ చేపట్టలేమని, ఉన్నవాటిని అమ్ముకున్న సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా బిల్లులు రాకపోతే రాబోయే రోజుల్లో ట్యాంకర్లు నిలిపివేయక తప్పదని కాంట్రాక్టర్లు వెల్లడిస్తున్నారు.

9 నెలలుగా పెండింగ్

నగర పరిధిలో సుమారు 70కిపైగా శివారుకాలనీలు ఉండగా ప్రతి రోజు 45 ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా సుమారు 200 ట్రిప్పులు నీటిని సరఫరా చేస్తుంటారు. ఒక్కో ట్యాంకర్‌కు టెండరు ప్రకారం ట్రిప్పుకు రూ.336 చెల్లించనుండగా, కార్పొరేషన్ అధికారులకు పర్సంటేజీల రూపంలో సుమారు 10 శాతం చెల్లించాల్సి ఉంది. దీంతో కాంట్రాక్టర్‌కు ఒక ట్రిప్పుకు రూ.270 మాత్రమే చేతికి అందుతుండగా, అది కూడా ఏడాది కాలంగా పైసా ఇవ్వలేదు. దీంతో ఇప్పటి వరకు 8 బిల్లులకు సంబంధించి సుమారు రూ.3.2 కోట్లు బిల్లులు రావాల్సి ఉందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. మరోవైపు రెండు రోజుల క్రితం కొత్తగా టెండర్లు పిలిచారు. ఆ క్రమంలో పాలకవర్గంలోని కొందరు పెద్దలు సంతకం పెట్టడంలో జాప్యం నెలకొనడంతో టెండర్లు ఆర్డరు రావడంలో ఆలస్యమైంది. దీంతో ట్యాంకర్లు నిలిపివేశారు. ఈక్రమంలో టెండరు పొందిన కాంట్రాక్టర్ ఉద్దేశ్యపూర్వకంగానే ట్యాంకర్లు నిలిపివేశారని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో ఆయనపై కార్పొరేషన్ తరుపున వేధింపులు చేసినట్లు ఇప్పుడు జోరుగా చర్చ జరుగుతోంది.

కాపు సంఘాన్ని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న అధ్యక్షుడు సంజీవకుమార్

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కాపు సంఘాన్ని బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ పిలుపునిచ్చారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘాన్ని బలోపేతం చేసేందుకు గ్రామ, మండల, నియోజకవర్గ, డివిజన్, పట్టణ స్థాయి నూతన కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అందుకోసం గ్రామ, గ్రామాన సభ్యత్వ నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం సభ్యత్వ నమోదు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టి.శ్రీనివాసమూర్తి, నరహరి సాంబయ్య, నారాయణ, చిల్లర హనుమంతరావు, అవిశినేని వెంగన్న, అయినాబత్తిన గోపీకృష్ణ, దరిమడుగు నాగరాజు, మేకల నరసింహారావు, మిరియాల వెంకటేశ్వర్లు, సుబ్బారావు, వసుపులేటి శ్రీనివాసరావు, జానకిరామ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వీఐపీ రోడ్‌లో దోపిడీకి దుండగుల యత్నం

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరం వీఐపీరోడ్‌లో గల అడపా వారి వీధిలో ఓ ఇంటిలో చొరబడిన దుండగులు దోపిడీకి యత్నించారు. ఆదివారం తెల్లవారుజామున వృద్ధుడైన కొణిజేటి నరసింహ (80) నివాసంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కాగా ఇంటి కిటికీ లోపల నుంచి గడియ తీసి చొరబడిన నలుగురు దుండగులు కత్తితో ఇంటి యజమానిని బెదిరించారు. దీంతో నరసింహ పెద్దగా కేకలు వేయగా కత్తి అక్కడే పడేసి రెండు సెల్‌ఫోన్‌లను తీసుకుని దుండగులు పారిపోయారు. అయితే వృద్ధుడుకి ఎటువంటి గాయాలు కాలేదని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పుగుండూరు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు, ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన మాగులూరి మురళీకృష్ణ, నాగమల్లేశ్వరి (50) దంపతుల మధ్య రూ.1000 నగదు విషయంలో వివాదం జరిగింది. దీంతో మనస్థాపానికి గురైన నాగమల్లేశ్వరి శనివారం రాత్రి గుళికల మందు తినడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగమల్లేశ్వరి ఆదివారం మృతిచెందారు. మృతురాలి కుమారుడు యశ్వంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు పొగాకు బ్యారన్ దగ్ధమైన సంఘటన నాగులుప్పలపాడులో జరిగింది. గ్రామానికి చెందిన తోకల వెంకటేశ్వర్లు కు చెందిన బ్యారన్‌లో ఆదివారం క్యూరింగ్ జరుగుతున్న సమయంలో పొగాకు అల్లిన కర్రలు మొద్దు గొట్టంపై పడటంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఒంగోలు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. అయితే మంటల ధాటికి పక్కనే ఉన్న వెంకటేశ్వర్లు సోదరుడు రామారావుకు చెందిన బ్యారన్ టైర్లు సైతం కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారుగా రూ.8లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

దొడ్డవరప్పాడులో..

మద్దిపాడు: దొడ్డవరప్పాడులో పొగాకు బ్యారన్ దగ్ధమైన ఘటన ఆదివారం జరిగింది. బెజవాడ వెంకటేశ్వర్లుకు చెందిన బ్యారన్‌లో ప్రమాదవశాత్తు పొగగొట్టంపై ఆకుకర్ర పడి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దాదాపు 290 కర్రలు అగ్నికి ఆహుతయ్యాయి. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ గోరంట్ల చిరంజీవి కోరారు.

నలుగురు జూదరుల అరెస్ట్

కొండపి, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటాకులపాలెం గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురిని ఆదివారం సాయంత్రం అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 13,640 రూపాయలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జూదరులను కోర్టుకు హాజరు పరుస్తామని ఆయన పేర్కొన్నారు.

మాజీ కౌన్సిలర్ అంజనాదేవి మృతి



అంజనాదేవి(ఫైల్)

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మునిసిపల్ మాజీ కౌన్సిలర్ కొఠారి అంజనాదేవి(80) ఆదివారం తెల్లవారుజామున ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. స్థానిక మరాఠిపాలెంకు చెందిన అంజనాదేవి 1995సంవత్సరంలో మునిసిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ తరుపున పోటీ చేసి గెలుపొందారు. 2001లో టీడీపీలో చేరి, గడిచిన కార్పొరేషన్ ఎన్నికల వరకు స్థానిక 12వ డివిజన్‌లో పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. ఈ సందర్భంగా మాజీ మునిసిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, టీడీపీ నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, డివిజన్ కార్పొరేటర్ అంబారి శ్రీనివాసరావు, కాకా శ్రీనివాసరావు తదితరులు ఆమెకు నివాళులర్పించారు.

వినతుల పరిష్కారంలో మందగమనం

ఒంగోలు మండలంలో 622 అందగా కేవలం 201 పరిష్కారం

అర్జీదారుల ఆవేదన

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలంలో ఇటీవల జరిగిన రెవెన్యూసదస్సుల్లో అర్జీలు వెల్లువెత్తాయి. మొత్తం 622 అర్జీలు ప్రజలు పలు సమస్యలపై అధికారులకు అందజేశారు. అయితే ఇందులో కేవలం 201 అర్జీలు మాత్రమే పరిష్కరించినట్లు తహసీల్దార్ తెలిపారు. కాగా కుల, ఆదాయ, ఫ్యామిలీ సర్టిఫికెట్‌లు, రైతుల భూములు ఆన్‌లైన్, పట్టాదారు పాసుపుస్తకాల కోసం, భూముల సర్వేకు, రీసర్వేలో వచ్చి తప్పులు సరిచేయటానికి ఎక్కువ మంది అర్జీలు అందించారు. అయితే ఇందులో అధికశాతం అర్జీలు భూ సమస్యలకు చెందని ఉన్నాయి. ప్రజలు తమ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఉండేందుకు కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించింది. ఈక్రమంలో అదేరోజు కొని అర్జీలు మాత్రమే పరిష్కరించారు. కానీ ఇప్పటికీ అధికశాతం అర్జీలు పెండింగ్‌లో ఉండటంపై రైతులు, మండలవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు జయంతి

- నివాళులర్పించిన కళాకారులు



నివాళులర్పిస్తున్న కళాకారులు

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రభోజుడిగా పేరొందిన శ్రీకృష్ణదేవరాయలు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయలు సాహిత్య సాంస్కృతిక సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక గాంధీ పార్కు ఎదురుగా ఉన్న శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పలువురు సాహితీవేత్తలు, కళాకారులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ 500 సంవత్సరాల కిందట తెలుగుభాషకు విశిష్ట ఖ్యాతిని కల్పించిన ఘనత శ్రీకృష్ణదేవరాయలుది అన్నారు. ప్రముఖ వైద్యులు నారపుశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు భాషకు పూర్వ వైభవాన్ని చేకూర్చడమే కృష్ణదేవరాయలుకు మనం ఇచ్చే నివాళి అన్నారు. డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ ప్రసంగిస్తూ శ్రీకృష్ణదేవరాయలు తన కొలువులో కవి సమ్మేళనాలు, సాహితీ గోష్టులు నిర్వహించి సాహితీ సమరాంగణ సార్వభౌమునిగా ఖ్యాతి చెందారని, ఆయన చరిత్రను ప్రస్తుత తరానికి చెప్పాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. లలిత కళా అకాడమీ అధ్యక్షుడు సంతవేలూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ సంస్కృతాంధ్ర, కన్నడ భాషలలో తిరుగులేని భాషా పటిమ ఉన్న కవి చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు అని కీర్తించారు. ఆయన రచించిన ఆముక్తమాల్యద ప్రకృతి వర్ణనలకు, గ్రామీణ వాతావరణానికి అద్దం పడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు తూము సుబ్బారావు, పలు సంస్థల ప్రతినిధులు మిడసల మల్లిఖార్జునరావు, జి.ఓబుల్‌రెడ్డి, మెడబలిమి సాంబశివరావు, మొగిలి దేవప్రసాద్, పి.గోవర్ధన్ రెడ్డి, ఐ.మురళీకృష్ణ, ఎం.వెంకటసుబ్బారావు, వల్లెపు మురళి, కొప్పోలు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అన్నదానానికి కమ్మవారి సేవా సంఘం ఆర్థికసాయం



నిర్వాహకులకు నగదును అందిస్తున్న మండవ మురళీకృష్ణ

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 26, 27,28వ తేదీలలో త్రిపురాంతకంలో జరుగనున్న అన్నదాన కార్యక్రమానికి ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం రూ.1,11,000 నగదును విరాళాన్ని అందజేసింది. ఈ నగదును త్రిపురాంతకం కమ్మసంఘం ప్రతినిధులకు ఆదివారం ఒంగోలులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కమ్మవారి సేవా సంఘం అధ్యక్షులు మండవ మురళీకృష్ణ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలకు కూడా తమ సంఘం తరపున సహకారం అందజేస్తుందని, ఇందులో భాగంగా కరవదిలో జరిగే క్రీడా కార్యక్రమానికి సహాయం అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు చిడిపోతు వెంకటేశ్వర్లు, సంఘ కార్యదర్శి ఆలా హనుమంతరావు, కన్వీనర్ కాట్రగడ్డ రఘు, గౌరవ సలహాదారు భాస్కరరావు, ఉపాధ్యక్షులు బాపయ్యచౌదరి, కంచర్ల నారాయణ, కోటపాటి కాశీరావు, బొడ్డపాటి వెంకట్, దుగ్గినేని వెంకట్రావు, మోటుపల్లి వెంకటేశ్వర్లు, అంగలకుర్తి వీరబ్రహ్మం, పాటిబండ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మోహనరావుకు మంత్రి నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి

టంగుటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూరారెడ్డిపాలేనికి చెందిన తుళ్లూరి మోహనరావు ఇటీవల మృతి చెందారు. ఆయన పెద్దకర్మ సూరారెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం జరిగింది. తుళ్లూరి పెద్దకర్మకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి హాజరై చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

23న విప్లవ పార్టీల ఐక్యత సభ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 23వతేదీన జరగనున్న విప్లవ పార్టీల ఐక్యత సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక మాదాల నారాయణస్వామి భవన్‌లో ఆదివారం ఐక్యత సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2013లో న్యూ డెమోక్రసీ పార్టీలో ఏర్పడిన చీలికలను సమీక్షించుకొని రెండు న్యూడెమోక్రసీ పార్టీలు ఈనెల 23న విజయవాడకేంద్రంగా ఐక్యంగా కాబోతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సీఎస్.సాగర్, బి.పద్మ, జాలన్న, కె.నాంచార్లు, ఆర్.మోహన్, రాజశేఖర్, ఎస్.భారతి, సీహెచ్.శ్యాం తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ నాయకుడికి సత్కారం

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా సీనియర్ నాయకుడు పి.పేరయ్యను ఘనంగా సత్కరించారు. స్థానిక రెవెన్యూభవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆయను సన్మానించి పేరయ్య అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.మధుసూదన్‌రావు, ఆర్.వాసుదేవరావు, శ్రీనివాసరావు, సాయి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుమన్, సహాధ్యక్షుడు గంటా సంపత్‌కుమార్‌ల కోరారు. ఒంగోలులో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పాణ్యం వేణు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించేందుకు అప్కాస్ రద్దుపై ఏర్పడిన అనిశ్చితిని ప్రభుత్వం తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కోశాధికారి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూనిక్ నంబర్లు : డీఏవో

మద్దిపాడు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): భూమి ఉన్న ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య ఇస్తున్నామని, దీనివల్ల ప్రభుత్వ పథకాలు, రాయితీలు నేరుగా అందతాఆయని డీఏవో ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం దొడ్డవరప్పాడు భరోసా కేంద్రంలో రైతులకు యూనిక్ నెంబర్లపై అవగాహన కల్పించారు. టీడీపీ నాయకులు గోరంట్ల చిరంజీవి, ఉపసర్పంచ్ ముల్లూరి మురళి, రైతులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఫ్యామిలీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని బొమ్మరిల్లు ఆశ్రమంలో పిల్లలకు స్పోర్ట్స్ డ్రెస్సులను, అల్పాహారం, పండ్లు అందజేశారు. విద్యార్థులకు అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. పొనుగుపాటి కాలనీలోని ఉషోదయ వృద్ధుల ఆశ్రమంలో 22 మంది వృద్ధులకు చీరల పంపిణీ, నెలకి సరిపడా నిత్యావసర వస్తువులను, మడనూరు గోసంఘానికి పశువుల దాణాను అందజేశారు. కార్యమంలో క్లబ్ అధ్యక్షుడు పీవీ.రాఘవరావు, క్లబ్ కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

సింగరాయకొండ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం 18 మంది మహిళలకు రూ.1.50 లక్షలు విలువ గల కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాలె రంగారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్‌కు చెందిన బీజీఆర్ మైనింగ్ అండ్ ఇన్ఫ్రా లిమిటెడ్ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద పేద మహిళలకు కుట్టు మిషన్లు అందజేసినట్లు తెలిపారు.

పచ్చదనంపై అవగాహన ర్యాలీ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పచ్చదనంపై ఒంగోలులో ఆదివారం భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్యాస్ సేల్స్ అధికారి మోహన్‌రావు, ఆయిల్స్ సేల్స్ అధికారి శ్యాంకుమార్, సివిల్ సప్లయీస్ అసిస్టెంట్ అధికారి ఐ.పుల్లయ్య, ఏజెన్సీల ప్రతినిధులు వీరాంజనేయులు, నరసింహులు, రవికిరణ్, గోవర్ధన్, కార్తీక్, కౌశిక్, శ్రీనివాసరావు, ఒంగోలు అపెక్స్ స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణం ప్రారంభం

టంగుటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' లో భాగంగా మండలంలోని ఎం.నిడమలూరులో 18 ఇంకుడు గుంతలు నిర్మాణానికి స్థానికులు ముందుకొచ్చారు. ఆదివారం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీవో సుబాషిణి, టీఏ కొండయ్య, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాకుమాను శ్రీకాంత్ పాల్గొన్నారు.

జిల్లా టెన్నికాయిట్ జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

సింగరాయకొండ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్త్రీ, పురుషులు టెన్నికాయిట్ జట్లును ఎంపిక చేశారు. పురుషుల విభాగంలో ఆర్.కార్తీకేయ, ఎం.శివశంకర్, వి.వెంకటేశ్వర్లురెడ్డి, డి.కౌశిక్‌బాబు, కె.హర్షవర్ధన్‌లను ఎంపిక చేశారు. స్త్రీల జట్టుకు జాస్మియా, పి.జహ్నవి, ఎల్.నిఖిత, బి.పద్మ, బి.కృప ఎంపికయ్యారు. వీరు ఈ నెల 20, 21 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొంటారు. జట్ల ఎంపికలో జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ సెక్రటరీఎస్‌టీ ప్రసాద్, ట్రెజరర్ శంకర్‌రావు పాల్గొన్నారు.

బాలల పండుగ.. ఉత్సాహం నిండగా!

కొందరు నృత్యంలో అద్భుత అభినయాన్ని ప్రదర్శించారు.. మరికొందరు చిత్రలేఖనంలో తమ చాతుర్యాన్ని చాటుకున్నారు.. ఇంకొందరు మట్టితో వ్యవసాయ పరికరాలను తయారుచేసి ఔరా అనిపించారు.. అంతేగాక ఫ్యాన్సీ డ్రస్సులతో వయ్యారంగా నడుస్తూ చూపరులను కట్టిపడేశారు.. వక్తృత్వ పోటీలలో తమ భాషా కౌశల్యాన్ని చాటి చెప్పారు.. ఇలా ఒక్కొక్కరు ఒక్కో అంశంలో సృజనాత్మకతకు కాదేదీ అనర్హం అని ఆ చిన్నారులు నిరూపించారు.

ఒంగోలులో అలరించిన బాలోత్సవ్ ప్రదర్శనలు

జిల్లా వ్యాప్తంగా 5 వేల మంది విద్యార్థుల హాజరు

పాల్గొన్న ఎమ్మెల్యే, ఎస్పీ, మేయర్

ఒంగోలులో జరిగిన బాలోత్సవం ప్రారంభ సభకు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బండారు లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించగా డీసీఈబీ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు, కమిటీ గౌరవాధ్యక్షుడు రమణారెడ్డి, అమరావతి బాలోత్సవం కార్యదర్శి రామరాజు, యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు, ఎంఈవోలు కిషోర్‌బాబు, బాలాజీ, కమిటీ నిర్వాహకులు కే సుబ్రహ్మణ్యం, డీ వీరాంజనేయులు, ఎస్ రవి పాల్గొన్నారు.



హాజరైన వేలాది మంది విద్యార్థులు



కూచిపూడి నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పచ్చగడ్డితో బాలిక

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి)



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్, పక్కన లక్ష్మీనారాయణ, రమణారెడ్డి, శ్రీనివాసరావు, సుబ్రమణ్యం



మట్టితో వినాయకప్రతిమలను చేస్తున్న చిన్నారులు

ఎవరేం మాట్లాడారంటే...

శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ బాలోత్సవాన్ని తిలకించి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు పలు రంగాల్లో విజ్ఞానం అవసరం అన్నారు. ఆ విజ్ఞానాన్ని వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని చెప్పారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చెడు అలవాట్లకు ముఖ్యంగా మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు జాగ్రత్త వహించాలన్నారు. డీఈవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యాశాఖకు వన్నెతెచ్చే విధంగా బాలోత్సవం కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని చెప్పారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ బాలోత్సవం విద్యా ప్రగతికి విద్యార్థులలోని ప్రతిభాపాటవాలను వెలికితీసేందుకు ఉపయోగపడుతుందన్నారు. డాక్టర్ సతీష్ మాట్లాడుతూ సమాజ ప్రగతికి విద్యార్థులే పునాదులని చెప్పారు.

మొత్తం 54 విభాగాల్లో 5 వేల మంది విద్యార్థులు

ఒంగోలు పీవీఆర్ మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో, పాఠశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన ప్రకాశం బాలోత్సవం కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా సుమారు 5 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనకు మొత్తం 8 వేదికలను ఏర్పాటు చేయగా, వ్యాసరచన, వక్తృత్వం, వైజ్ఞానిక ప్రదర్శనలను పాఠశాల తరగతి గదులలో, ఆవరణలో నిర్వహించారు. విద్యార్థులు లఘునాటికలు, జానపద నృత్యాలు, ఏకపాత్రలు, కోలాటం ఇలా 54 విభాగాల్లో ప్రదర్శించారు. అదేవిధంగా పద్యం చెప్పటం, కథ చెప్పటం, మట్టితో వ్యవసాయ పరికరాలను తయారు చేయటం వంటివి ప్రదర్శించారు.



మొక్కలతో బాలోత్సవ్ పేరు ముందు పలు వేషధారణలలో చిన్నారులు



రాకెట్ ఆకృతిలో రాచర్లకు చెందిన స్పందన

డాక్టర్ కవితకు అరుదైన పురస్కారం

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు చేతుల మీదుగా ప్రదానం

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఆరోగ్య సంరక్షణ రంగంలో గణనీయమైన కృషి చేసినందుకు గ్యాస్ట్రో ఎంట్రాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ముక్కు కవితకు అరుదైన పురస్కారం లభించింది. టైమ్స్ నెట్‌వర్క్ ఇండియా హెల్త్ కేర్ అవార్డ్సులో ఆమెకు చోటు దక్కింది. ఆదివారం విశాఖపట్నంలో అవార్డుల ప్రదానం జరిగింది. కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు చేతుల మీదుగా డాక్టర్ కవిత అవార్డును అందుకున్నారు. కనిగిరి శాసనసభ్యుడు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి సతీమణి అయిన డాక్టర్ కవిత గుంటూరు జీజీహెచ్‌లో గ్యాస్ట్రో ఎంట్రాలజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. జిల్లాలోని పశ్చిమప్రాంత ప్రజలకు కూడా ఆమె సుపరిచితులు. ఆరోగ్య సంరక్షణ భవిష్యత్‌ను రూపొందించడంలో మెరుగైన పాత్ర పోషించినందుకు ఆమెకు అవార్డు ఇచ్చినట్లు నిర్వాహకులు ప్రకటించారు. కవిత కృషిని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రత్యేకంగా కొనియాడారు.



డాక్టర్ కవితకు అవార్డును అందజేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్

చెల్లిని చూసేందుకు వెళ్తూ లారీని ఢీకొని యువకుడు మృతి

మనుబోలు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకెళ్తే... తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం బండారుపల్లికి చెందిన మద్దిపట్ల రాజేష్‌నాయుడు(34) ఆరేళ్ల క్రితం గూడూరుకు చెందిన ఎస్‌కే ఆరిఫాను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొయ్య పని చేసుకుని జీవనం సాగించే రాజేష్‌నాయుడు పనుల కోసం 5 ఏళ్ల క్రితం బండారుపల్లి నుంచి ప్రకాశం జిల్లా సింగరాయకొండకు వలస వచ్చాడు. ఈ నేపథ్యంలో బండారుపల్లిలో ఉంటున్న చెల్లెలను చూసేందుకు ఆదివారం స్నేహితుడు మునిశేఖర్‌తో కలసి బైక్‌పై బయలుదేరాడు. మనుబోలు మండలం కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. రాజేష్ అక్కడికక్కడే మృతి చెందగా, మునిశేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ శివరాకేష్ క్షతగాత్రుడిని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

రక్తదానం చేస్తూ.. చేయిస్తూ...!

- ఆపద సమయంలో ప్రాణాలను కాపాడుతున్న మురళీసుధాకరరావు
- రోడ్డు ప్రమాద బాధితులకు, ఆపరేషన్ సమయంలో రక్తహీనతతో ఉండే వాళ్లకు గుర్తొచ్చేది అతడే
- 16 ఏళ్ల నుంచి రక్తదాతల గ్రూపు నిర్వహణ

అద్దంకి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కళ్ల ముందు కనిపించిన సంఘటన, కొంతమందిలో కొత్త ఆలోచనకు తెరలేపుతుంది. ఇంకొందరికి స్ఫూర్తినింపుతుంది.. సేవాభావం చిగురిస్తుంది. హైదరాబాద్‌లో తన కళ్ల ముందు జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి వైద్యశాలలో చికిత్స పొందుతూ రక్తం అందుబాటులో లేక మృతిచెందడం అద్దంకి పట్టణానికి చెందిన చుండూరి మురళీసుధాకరరావును కలచివేసింది. అప్పటి నుంచి రక్తం అవసరమైన వారికి రక్తదానం చేయాలనే సంకల్పానికి వచ్చారు.

సుమారు 2వేల మంది రక్తదాతలను గుర్తించి వాళ్ల బ్లడ్ గ్రూప్, ఫోన్ నెంబర్లను తన వద్ద ఉంచుకున్నారు. దీంతో ఏ బ్లడ్ గ్రూప్ రక్తం అవసరమైతే తన వద్ద ఉన్న జాబితాలో ఆ బ్లడ్ గ్రూప్ వాళ్లకు ఫోన్ చేసి వైద్యశాలకు పిలిపిస్తారు. అక్కడే రక్తదానం చేయిస్తారు. ఇలా 2009లో ప్రారంభించి సుమారు 15 ఏళ్లుగా ఇప్పటివరకు 443 రక్తదానాలు చేయించారు. సుధాకరరావు ఇప్పటి వరకు 20సార్లు రక్తదానం చేశారు. అందులో టీడీపీ ఆధ్వర్యంలో జరిగే మహానాడు సభలలో కూడా 4సార్లు రక్తదానం చేశారు. ఇక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అద్దంకిలో రెండుసార్లు రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయించారు. తాను రక్తదానం చేయడంతోపాటు ఇతరుల చేత రక్తదానం చేయిస్తూ ఆపదలో ఉన్న బాధితులకు, కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.



రక్తదానం చేస్తున్న చుండూరి(ఫైల్)

రోడ్డు ప్రమాదాలలో క్షతగాత్రులు, ఆపరేషన్లు చేసే సమయంలో, ఇతర వ్యాధులతో బాధపడే వారికి, రక్తహీనతతో బాధపడే మహిళలకు అత్యవసరంగా రక్తం అవసరం అవుతుంది. బ్లడ్‌బ్యాంక్‌లు ఉన్న పట్టణాలలో అయితే డబ్బు చెల్లించి కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. అద్దంకిలో బ్లడ్ బ్యాంక్ లేకపోవడంతో వైద్యుల తోపాటు ఆయా కుటుంబాలకు వెంటనే గుర్తుకు వచ్చేది మురళీసుధాకరరావు, వృత్తి రీత్యా మెడికల్ షాపు నిర్వహించే అతను అద్దంకి పట్టణ మెడికల్‌షాపుల అసోసియేషన్‌లో కూడా సభ్యుడిగా, వివిధ పదవులలో పనిచేయడంతో అందరినీ తన సైన్యంలో సభ్యులుగా చేర్పించారు. అదే సమయంలో తన స్నేహితులను, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులను కూడా ఒప్పించారు.



దాతల చేత రక్తదానం చేయిస్తున్న చుండూరి మురళీసుధాకరరావు(ఫైల్)

ఆ సంఘటనే నన్ను కదిలించింది

చుండూరి మురళీసుధాకరరావు, అద్దంకి

హైదరాబాద్‌కు పనిమీద వెళ్లినప్పుడు అక్కడ నా కళ్లముందు గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రక్తస్రావమైంది. నేనే స్వయంగా అతనిని హాస్పటల్‌కు తీసుకుపోయినప్పటికీ ఫలితం లేదు. అప్పటి నుంచి రక్తం కోసం బాధితులు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో 2వేల మంది ఫోన్ నెంబర్లు సేకరించి అవసరమైన సమయంలో వాళ్ల చేత రక్తదానం చేయిస్తున్నా. ఆపదలో ఆదుకుంటున్నామన్న సంతృప్తి రక్తదాతలు వ్యక్తం చేస్తున్నారు.



వందేళ్ల గురువుకు ఘన సత్కారం

- శత వసంతంలోకి అడుగిడిన రాఘవయ్యపంతులు
- జబ్బులను దరిచేరనీయకుండా ఆరోగ్యవంతమైన జీవనం

చీమకుర్తి, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి) : రోగాలతో సహజీవనం చేస్తున్న నేటి ఆధునిక యుగంలో మనుష్యులు వందేళ్లు జీవించటం అంటే గగనంగా మారింది. అంతకుమించి శతాధిక వయస్సులో జబ్బులను దరిచేరనీయకుండా తన పనులు తాను చేసుకుంటూ ఆరోగ్యకరమైన జీవనం సాగించటం అంటే నమ్మశక్యం కాని విషయం అనిపిస్తుంది.

చీమకుర్తి పట్టణం కంచుకోటబజార్‌లో నివాసం ఉంటున్న రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు వేమూరి రాఘవయ్య పంతులు వందేళ్లు పూర్తి చేసుకోగా.. ఈ ఏడాది జూన్‌లో 101వ జన్మదినోత్సవం జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం రాఘవయ్యపంతులు ఇంట వందేళ్ల వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువర్యుల పాదాలకు నమస్కరించిన శిష్యులు ఆయన ఆశీర్వచనం తీసుకున్నారు. వందేళ్ల వయసులోనూ తమ గురువు ఆరోగ్యంగా, చలాకీగా ఉండటాన్ని గొప్పగా చెప్పుకుంటూ ఉప్పొంగిపోయారు. తమ గురువుకు జరిపిన సత్కారాన్ని సోషల్‌మీడియాలో పోస్టుచేసి ఆయన ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని, జీవనశైలిని కొనియాడుకున్నారు. గురువుతో తాము గడిపిన గతస్మృతులను నెమరువేసుకున్నారు. రాఘవయ్య పంతులుకు సతీవియోగం జరిగింది. ఇద్దరు కుమారులు కాగా వారూ తమ ఉద్యోగాల్లో రిటైర్ కావటం విశేషం. తండ్రి కోసం కొన్ని నెలలు పెద్దకొడుకు కుటుంబం, కొన్ని నెలలు చిన్నకొడుకు కుటుంబం చీమకుర్తికి విచ్చేసి తండ్రితో ఉంటారు. రాఘవయ్య మాత్రం ఎవరున్నా లేకపోయినా తన పనులు తాను మాత్రం చేసుకుంటూ దైవధ్యానంలో నిమగ్నమై ప్రశాంతకరమైన జీవనాన్ని సాగిస్తుంటారు. కాగా రాఘవయ్యను ఘనంగా సత్కరించిన వారిలో కుటుంబసభ్యులు, శిష్యులు పరాంకుశం శ్రీనివాసమూర్తి, అవనిగడ్డ శేషారావు, పోకూరి సుబ్బారావు, కోదాటి శివ నాగేశ్వరరావు, మద్ది జగన్‌మోహనరావు, ముద్దనూరు సుబ్బారావు, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, షేక్ ఖాదరవలి పాల్గొన్నారు.



రాఘవయ్యపంతులును సత్కరిస్తున్న శిష్యులు

అవీ..ఇవీ

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మృతిచెందిన వెంకట రామయ్య

పొదిలి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గోగినేనివారిపాలెం సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కనిగిరి పట్టణం ఇందిరాకాలనీకి చెందిన కొమ్మిరెడ్డి వెంకటకొండయ్య ఊరూరా తిరుగుతూ, దువ్వెనలు, ఇతర గృహోపకరణాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం గోగినేనివారిపాలెం గ్రామంలో అమ్ముకొని వస్తూ రోడ్డు దాటుతుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో వెంకటకొండయ్య(64) అక్కడికక్కడే మృతిచెందాడని ఎస్‌ఐ వేమన తెలిపారు. ఆయన కుమారుడు శ్రీనివాసులు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్మీ ఉద్యోగి మృతికి ఎమ్మెల్యే నివాళి


మృతదేహనికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

బేస్తవారపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట మండలంలోని గొట్టంమిల్లు గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్(సుబేదార్) మహారాష్ట్రలోని పూణేలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామం గొట్టమిల్లు గ్రామానికి రావడంతో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వెళ్లి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాడసానుభూతి తెలిపారు. ప్రభుత్వం ఆ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అధికార లాంఛనాలతో ఆర్మీ జవాన్‌కు అంత్యక్రియలు నిర్వహించారు.

వాహనాల దారి మళ్లింపు

గిద్దలూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం అనుమలపల్లి గ్రామంలో 17న సోమవారం జీవనమూర్తిస్వామి జెండా మహోత్సవ తిరునాళ్ల సందర్భంగా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని అనుమలపల్లి జంక్షన్ ఆర్చి సమీపంలో రోడ్డును మూసివేసినట్లు ఎస్సై పి.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు నుంచి ఆరవీటికోట, ఆకవీడు, కొత్తూరు, అచ్చంపేట, చినగానిపల్లి, చోళ్లవీడు, జేపీ.చెరువు గ్రామాలకు వెళ్లే వారు అనుమలపల్లి మీదుగా కాకుండా పలుగుంటిపల్లి గ్రామం మీదుగా వాహనాలలో వెళ్లాలని ఎస్సై పేర్కొన్నారు. అలాగే కంభం వైపు నుంచి ఆయా గ్రామాలకు వెళ్లే వారు అక్కపల్లె రోడ్డు నుంచి వెళ్లాలని సూచించారు. సోమవారం మొత్తం వాహనాల మళ్లింపు ఉంటుందని, అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకుని వాహనచోదకులు పోలీసులకు సహకరించాలన్నారు.

పోలీసులకు డ్రోన్ కెమెరాల అందజేత



డ్రోన్ కెమెరాను అందచేస్తున్న టీడీపీ నాయకులు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు స్థానిక టీడీపీ నాయకులు సహకారం అందించారు. అర్బన్ సీఐ కె.సురేష్‌కు టీడీపీ నాయకులు చంటి, దిలీప్ డ్రోన్ కెమెరా అందించారు. ఇటీవల జిల్లా ఎస్పీ దామోదర్ గిద్దలూరు పోలీసుస్టేషన్ తనిఖీ సమయంలో నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో అర్బన్ సీఐ కె.సురేష్ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. పోలీసుల చర్యలకు తమవంతు సహకారంగా స్థానిక టీడీపీ నాయకులు చంటి, దిలీప్ డ్రోన్ కెమెరా అందించారు. డ్రోన్‌తో నేరాలను అరికట్టేందుకు ఉపయోగిస్తామని సీఐ తెలిపారు. డ్రోన్ అందించిన టీడీపీ నాయకులను అభినందించారు.

నగర పంచాయతీ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హామీ
- చెత్తసేకరణ ట్రాక్టర్ ప్రారంభం
- కాటూరివారిపాలెంలో సబ్‌స్టేషన్ ప్రారంభం


విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

పొదిలి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పొదిలి నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో చెత్త సేకరణ ట్రాక్టర్‌ను ఆయన ప్రారంభించారు. నగర పంచాయితీ వార్డులలో చెత్త సేకరణకు ఇటీవల మంజూరైన నూతన ట్రాక్టర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా ట్రాక్టర్ నడిపి సిబ్బందిని ఉత్సాహపరిచాడు. అనంతరం దర్శి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం కాటూరివారిపాలెం గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 5ఎంవీఏ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ వేసవి కాలంలో కాటూరివారిపాలెం, బుచ్చన్నపాలెం, కొత్తపాలెం, అన్నవరం, పొదిలి పట్టణంలోని రైతులకు గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో తారతమ్యాలు లేకుండా స్థిర పరిచేందుకు సబ్‌స్టేషన్ ఉపయోగ పడుతుందన్నారు. త్వరలో మండలంలోని ఏలూరులో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తామన్నారు. తద్వారా విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం ఉండదన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు

మార్కాపురం : పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం ద్వారా మెరుగైన సేవలందిచడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆదివారం సాయంత్రం నియోజకవర్గ పరిధిలో 17 మందికి మంజూరైన రూ.18.06 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా రేషన్‌కార్డు ఉండి కార్పొరేట్ వైద్యం చేయించుకున్న ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సకాలంలో ఆర్థిక సాయం అందుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహాయనిధి చెక్కులను సాధ్యమైనంత వేగంగా లబ్ధిదారులకు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా బావించి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర దిశగా పరుగులు పెట్టిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, నారు వెంకటేశ్వరరెడ్డి, జంకె రమణారెడ్డి పాల్గొన్నారు.

అర్హుల గుర్తింపునకు నేడు ఇంటర్వ్యూలు

కంభం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అర్ధవీడు మండలంలో బీసీ, ఈబీసీ, కాపు తదితర కార్పొరేషన్ల స్వయం ఉపాధి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారికి 17 నుంచి 19వ తేదీ వరకు ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నరసయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న అర్ధవీడు గ్రామం, 18న పాపినేనిపల్లి, బోగోలు, అయ్యవారిపల్లి, మొహిద్దీన్‌పురం, దొనకొండ గ్రామాలు, 19న బొల్లుపల్లి, గన్నేపల్లి, కాకర్ల, నాగులవరం, వెలగలపాయ, రంగాపురం, మాగుటూరు, యాచవరం, పెద్దకందుకూరు గ్రామాల వారికి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం, దరఖాస్తు ఫారాలు తీసుకురావాలన్నారు.

మకర తోరణం అందజేత

గిద్దలూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్లపాడు గ్రామంలోని శ్రీఅభయాంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారి ఉత్సవ విగ్రహానికి రూ.14వేల విలువైన మకర తోరణాన్ని భక్తులు అందజేశారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు దరిసి వెంకటరత్నం దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు దరిసి రమేష్‌బాబు, శ్రీనివాసరావు, రాములు మకర తోరణాన్ని దేవస్థాన కమిటీకి అందజేశారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవం



కృష్ణను సన్మానిస్తున్న సభ్యులు

కంభం, ఫిబ్రవరి16, (ఆంధ్రజ్యోతి): కంభం మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఐతా కృష్ణ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన మువ్వల శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షునితోపాటు కార్యదర్శిగా సోమిశెట్టి రాజా, కోశాధికారిగా కటకం ప్రదీప్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమం లో విఠా వెంకటశ్రీనివాసరావు, ఎన్నికల పరిశీలకులు బొంతల సుదీర్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నాదెళ్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న నూతన కమిటీ సభ్యులు

బేస్తవారపేట : బేస్తవారపేట మండల ఆర్య వైశ్య కమిటీ అధ్యక్షులుగా జక్కా సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం బేస్తవారపేటలో జరిగిన సమావేశంలో కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ సందర్భంగా జక్కా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. సంఘం కార్యదర్శిగా వాగిచర్ల మారుతిప్రసాద్, ఉపాధ్యక్షులుగా దోగిపర్తి కొండలు, కోశాధికారిగా శ్రీరాంప్రసాద్, సహాయ కార్యదర్శిగా ముప్పూరి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

శ్రీరాముని అవతారంలో మువ్వ గోపాలుడు


శ్రీరాముని అలంకరణలో వేణుగోపాలుడు

తర్లుపాడు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులో వెలసిన శ్రీ రుక్మిణి సత్యభామ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం హనుమంత వాహనంపై శ్రీరామని అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. కారంపూడి వెంకట రమణాచార్యులు, కూనపులి వెంకటశర్మ, మోహన్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవ విగ్రహాలను రథంపైకి తీసుకొచ్చి తర్లుపాడు పురవీధుల్లో మేళతాళాలతో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు వార్లుపోసి కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదాతలు కశ్శెట్టి వెంకట జగన్‌బాబు, ధర్మపత్ని భాగ్యలక్ష్మీ, కశ్శెట్టి కిరణ్ కుమార్, ధర్మపత్ని భవానీలు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. హనుమంత వాహనం సందర్భంగా ఉభయదాతల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త జవ్వాజి విజయభాస్కర్‌రావు, వివిధ వాహనాల ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

మాగుంట కోలుకోవాలని పూజలు


పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి త్వరగా కోలుకోవాలని డీఆర్‌యూసీసీ సభ్యులు గాయం వెంకట నారాయణరెడ్డి, టీడీపీ ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షు లు షేక్ మాబు ఆధ్వర్యంలో మంతనా లమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దోర్నాల మండలం లోని నల్లమల అటవీ ప్రాంతంలో కొలువైన చెంచు గిరిజనుల కులదేవత మంతనాలమ్మ అమ్మవారి కి మండల టీడీపీ నాయకులు పూజలు చేశారు. కార్యక్రమంలో బట్టు సుధాకర్ రెడ్డి, షేక్ మౌలాలి పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠ

గిద్దలూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదర్శ బీఈడీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 17న సోమవారం శ్రీఅభయాంజనేయ స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠను పురష్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతిపూజ, అంకురారోహణం, జలదివాసం తదితర పూజలు నిర్వహించారు. సోమవారం ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని, భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆదర్శ విద్యాసంస్థల అధినేత బుడత తిమ్మయ్య పేర్కొన్నారు. బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేస్తామన్నారు.

కూలి కోసం వెళ్లి కానరాని లోకాలకు

- ట్రాలీ వాహనం బోల్తా
- ఇద్దరు మహిళల మృతి, పది మందికి గాయాలు
- నికరంపల్లి వద్ద జాతీయ రహదారిపై ఘటన


ఘటన స్థలంలో తీవ్రగాయాలతో పడి ఉన్న కూలీలు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మిరప కాయల కోతకు వెళ్లి వస్తున్న కూలీల ఆటో బోల్తాపడిన పడి ఇద్దరు మృతి చెందిన ఘటన మండలంలోని నికరంపల్లి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మార్కాపురం పట్టణంలోని కొండారెడ్డి కాలనీ నుంచి కూలీలు ట్రాలీ ఆటోలో మిరప కాయలు కోసేందుకు పెద్దారవీడు మండలం చట్టమిట్ల గ్రామం వెళ్లారు. సాయంత్రం తిరిగి మార్కా పురం పట్టణం వస్తుండగా మండలంలోని నికరంపల్లి వద్ద జాతీయ రహదారిపై ట్రాలీ ఆటో టైరు పంచరయ్యింది. దీంతో వాహనం తిరగబడింది. ప్రమాదంలో మార్కాపురం పట్టణం పూల సుబ్బయ్య కాలనీ వద్ద ఉన్న కొండారెడ్డి కాలనీకి చెందిన షేక్ మున్ని(40)కి తీవ్రగాయాలయ్యాయి. ఆమెను వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. మరోక మహిళ అరబోలు లక్ష్మీదేవి (54) తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో ఒంగోలు కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె వృతిచెందారు. ట్రాలీ ఆటోలోని మరో పది మంది గాయపడ్డారు. వీరిలో సుబ్బులు, నాసరయ్య, లక్ష్మీ, మస్తానమ్మ, షేక్ ఖైరున్, షేక్ వలి, శ్రీలక్ష్మీల తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరు వైద్యశాలలో చికిత్స పొందుతు న్నారు. ప్రమాదంలో ట్రాలీ డ్రైవర్ మస్తాన్ చేతికి తీవ్ర గాయమైంది. మెరుగైన వైద్యం నిమిత్తం ఆయన్ను నరసరావుపేటకు తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో ట్రాలీ ఆటోలు సుమారు 25 మంది కూలీలు ఉన్నా రు. వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారిని సీఐ సుబ్బారావు, రూరల్ ఎస్ఐ అంకమ్మ రావులు పరిశీలించి వివరాలను సేకరించి ప్రమాదానికి కారణాలను తెలుసుకున్నారు.



మున్ని మృతదేహం వద్ద రోధిస్తున్న బంధువులు, మృతిచెందిన లక్ష్మీదేవి

శ్యాంప్రసాద్‌ను గుప్తనిధుల కోసమే హత్య చేశారా ?

పలు కోణాల్లో విచారిస్తున్న పోలీసులు


శ్యాంప్రసాద్ (ఫైల్)

కంభం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కంభం పట్టణంలో సంచలనం సృష్టించిన కదం శ్యాంప్రసాద్ (34) హత్య కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. సోదరులు తల్లే హత్య చేసినట్లు ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించుకున్నప్పటికీ, హత్యకు కారణాలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు ఈ అంశంపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. మద్యానికి బానిసై పెద్దగా శరీర సౌష్టవం లేని దివ్యాంగుడైన శ్యాంప్రసాద్‌ను హత్య చేయడం కుటుంబ సభ్యులకు పెద్ద విషయం కాదని పోలీసులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో హత్య చేయడానికి నిందితులు చెబుతున్న కారణాలను కూడా పోలీసులు విశ్లేషిస్తున్నారు. మృతుడి తల్లి లక్ష్మీదేవి ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో గుప్త నిధులు ఉన్నాయని, ఆ నిధులను వెలికి తీయాలంటే ఒకరిని బలిదానం చేయాలని, అందులో భాగంగానే శ్యాంప్రసాద్‌ను బలి ఇస్తే సరిపోతుందని నిందితులు హత్య చేశారా..? అన్న కోణంలోనూ విచారిస్తున్నారు. దీని కోసమే కుటుంబసభ్యులు ముగ్గురితో పాటు అర్బన్ కాలనీలో నివసిస్తున్న ఆటోడ్రైవర్ మోహన్‌కు సుపారి ఇచ్చి తెచ్చుకున్నారనే చర్చ స్థానికంగా సాగుతోంది. మృతుడి శరీర భాగాలను ఎనిమిది భాగాలుగా కోసిన తీరుపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హత్య చేసి శరీర భాగాలను దూరంగా పడేసేందుకు వీలులేక పోవడంతో సమీపంలోని కాలువ గట్టున పడవేసి ఉంటా రని పలువురు భావిస్తున్నారు. ఏది ఏమైనా పోలీసుల విచారణలో నిజాలు తెలియాల్సి ఉంది.


ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రను మర్యాదపూర్వకంగా కలిసిన మస్తాన్‌వలి

టెలికం అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా మస్తాన్‌వలి

కనిగిరి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ గుంటూరు జోనల్ టెలికం అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా షేక్ పీర మస్తాన్‌వలి నియమితులయ్యారు. ఈమేరకు భారత సంచార నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) కేంద్ర చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఊర్వశి శంగ్వాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే ఆయనను సత్కరించారు. బీఎస్ఎన్ఎల్ మనుగడకు, అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. మస్తాన్‌వలి 2001 నుంచి 2005 వరకు కనిగిరి గ్రామ పంచాయతీ వార్డు సభ్యునిగా, 2014 నుంచి 2019 వరకు కనిగిరి నగర పంచాయతీ కోఆప్షన్ మెంబర్‌గా సేవలు అందించారు. మెంబర్‌గా అవకాశం ఇప్పించిన ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి మస్తాన్‌వలి కృతజ్ఞతలు తెలిపారు. బీఎస్ఎన్ఎల్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

డయాలసిస్ కేంద్ర అభివృద్ధికి విరాళం

పామూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కనిగిరిలోని డయాలసిస్ కేంద్రం ఆధునీకరణ కోసం పామూరు మండలం తిరగళదిన్నె గ్రామానికి చెందిన టీడీపీ బీసీ సంఘం నాయకుడు మల్లెబోయిన బాల బ్రహ్మయ్య యాదవ్ రూ.50 వేలు అందజేశారు. ఆదివారం పామూరులోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రకు నగదు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫ్లోరైడ్ బాధితుల సహాయార్థం, ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు, యారవ శ్రీను, మాజీ సర్పంచ్ ఎం.గురుబ్రహ్మం, ఆవుల రమణమ్మ, ముబినా మౌలాలి పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత లక్ష్మీనారాయణ మృతి


లక్ష్మీనారాయణ (ఫైల్)

తాళ్లూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్రపాటివారిపాలెం మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నేత కోట లక్ష్మీనారాయణ ఆదివారం ఉదయం మృతి చెందాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. లక్ష్మీనారాయణ మృతిపట్ల ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జి. వేణుబాబు, కొర్రపాటి శ్రీదేవి రామయ్య, కోట నరసింహారావు, ఎం.వెంకటేశ్వరెడ్డి, ఐ.శ్రీనివాసరెడ్డి, మన్నేపల్లి సమర, విద్యాసాగర్, నుసు ఆదినారాయణరెడ్డి, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి, సంక్షేమం

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి
- మాయమాటలకు మోసపోవద్దు
- మోపాడులో భారీగా టీడీపీలో చేరిక

పామూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందజేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఎంపీపీ, జడ్పీటీసీ సొంత గ్రామమైన మోపాడులో వైసీపీకి భారీ షాక్ తగిలింది. మండలంలోని మోపాడు ఇరిగేషన్ బంగ్లా వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో వైసీపీకి చెందిన ముస్లిం, ఎస్సీ, బీసీ, వివిధ సామాజిక వర్గాల 50 కుటుంబాలకు చెందిన 94 మంది ఎమ్మెల్యే ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ప్రజలకు సేవకుడిగా ఉండేందుకే తాను రాజకీయాల్లో వచ్చానని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. తన హయాంలో మోపాడు ప్రాజెక్టు ఆధునికీకరణ కింద జైకో నిధులతో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. వెలిగొండ ప్రాజెక్టును మోపాడు రిజర్వాయర్‌కు అనుసంధానం చేయడం తమ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా రాజకీయ వివక్షత చూపనని స్పష్టం చేశారు. మన పిల్లల భవిష్యత్తు కోసం అందరూ ఏకం కావాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన మేరకు టీడీపీ బలోపేతం కోసం అందరిని పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకొంటే మనకు భవిషత్తు ఉంటుందన్నారు.

అనంతరం గ్రామ పంచాయతి 5వ వార్డు మెంబర్ గుల్లాపల్లి కుమారితో సహా పలువురు ముస్లిం, మైనార్టీలు, ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన 94 మంది టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఎం.గిద్దయ్య యాదవ్, మోపాడు ప్రాజెక్టు సూపర్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు చుంచు కొండయ్య, ఎం.నరసింహారావు, మాజీ జడ్పీటీసీ ఎం.హనిసేన్ రావు, మాజీ ఎంపీటీసీ చప్పిడి రామయ్య, టీడీపీ నాయకులు యారవ శ్రీనువాసులు, ఏ.ప్రభాకర్‌చౌదరి, బి.నరసింహారావు, ఉప్పలపాటి హరిబాబు, సయ్యద్ అమీర్‌బాబు, వై.ప్రసాదరెడ్డి, ఇర్రి కోటిరెడ్డి, గోళ్ల వీరబాబు, షేక్ రహంతుల్లా, పువ్వాడి రామారావు, మన్నం రమణయ్య, దారపనేని సుబ్బారావు, పచ్చవ బాబు, కామిరెడ్డి తిరుపతిరెడ్డి, తెలజాల ప్రసాద్, పచ్చా పేరయ్య, ఖాజా మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.


వైసీపీ శ్రేణులకు టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న తూర్పుగంగవరం పంచాయతీ సోమవర్పాడు పరిధిలోని గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగాభవానీ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు ప్రాంతంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు వచ్చారు. ఆలయ బ్రాహ్మణఅర్చకులు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్ రావు, విజయలక్ష్మి, బాలరాజు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆల య కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్‌ఏ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

వైభవంగా దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ


దక్షిణామూర్తి విగ్రహం

కురిచేడు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని జ్ఞాన ప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వర ఆలయంలో ఆదివారం ఉదయం మేధో దక్షిణామూర్తి, కాలభైరవుడు, ఉత్తర చండీశ్వర విగ్రహాలను భక్తుల కోలాహలం మధ్య ప్రతిష్ఠించారు. మేధో దక్షిణామూర్తి విగ్రహాన్ని చింతల చెరువు గ్రామానికి చెందిన దేవలపల్లి విశ్వనాధశాస్త్రి, చండీశ్వరుడి విగ్రహాన్ని తొమ్మండ్రు నాగరాజు, కాలభైరవ విగ్రహాన్ని తేలప్రోలు వెంకట సుధాకర్‌లు అందజేశారు. కార్యక్రమంలో ప్రతిష్టాచార్యులుగా సాగి నరసింహమూర్తి, ఆలయ అర్చకులు కురిచేటి సుబ్బారావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు

పామూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పామూరు మేజర్ పంచాయతి పరిధిలోని గోపాలపురం జాతీయ రహదారి పక్కన నూతనంగా నిర్మించిన పార్వతి పరమేశ్వర శివాలయం ప్రారంభోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు చిమటా కార్తికేయ స్వామి ఆధ్వర్యంలో యజ్ఞహోమాలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠ, శాంతి హోమాలు జరుగు తాయని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. స్వామి వార్లకు మహా నైవేద్యాన్ని మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి సమర్పించారు. అనంతరం గోశాలలోని గోవులకు పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చినఆదినారాయణ, ఈవో నరసింహాబాబు, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా జీరో వ్యాపారం

- బిల్లులు లేకుండా దిగుమతి అవుతున్న సరుకులు
- చోద్యం చూస్తున్న అధికారులు

దర్శి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలో జోరుగా జీరో వ్యాపారం సాగుతోంది. బిల్లులు లేకుండా సరుకులు దిగుమతి అవుతున్నాయి. కొంతమంది అక్రమ వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి బిల్లులు లేని సరుకులు తెచ్చి విక్రయించి లబ్ధి పొందుతున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో అక్రమవ్యాపారం విచ్చలవిడిగా సాగుతోంది. కొంతమంది అక్రమార్కులు హైదరాబాద్ నుంచి పాల పొడిని బిల్లులు లేకుండా తెచ్చి విక్రయిస్తున్నారు. ఆ పొడి ద్వారా ఇక్కడ కల్తీపాలు ముమ్మరంగా తయారుచేస్తున్నారు. పాలపొడి వ్యాపారులు కల్తీపాలు తయారుచేసే అక్రమార్కులకు కుమ్మక్కై ప్రతిరోజు వేలాది లీటర్ల కల్తీపాలు విక్రయిస్తూ లబ్ధి పొందుతున్నారు. ప్రజలు కల్తీపాలు తాగి అనారోగ్యం పాలవుతున్నారు. హైదరాబాద్ నుంచి నెలకు వంద టన్నులకు పైగా పాలపొడి దర్శి ప్రాంతానికి వస్తున్నట్లు సమాచారం. ఇక్కడ పాలపొడి కొనుగోలుచేసే అవసరం ఎవరికీలేదు. కేవలం కల్తీపాలు తయారుచేసే అక్రమార్కులు మాత్రమే ఆపొడిని ఉపయోగిస్తున్నారు.

అలాగే, బాణసంచా విక్రయాలు కూడా బిల్లులు లేకుండా అక్రమవ్యాపారం జరుగుతుంది. వాణిజ్య పన్నులశాఖ, ఆహర భద్రతా శాఖ అధికారులు ఈ అక్రమ వ్యాపారం గురించి పట్టించుకోవటం లేదు. ఆహర భద్రతా శాఖ అధికారులు ఫిర్యాదులు అందినప్పుడే తనిఖీలు చేస్తున్నారు. జిల్లా అధికారులు తనిఖీలు చేసిన ప్రతిసారీ కల్తీపాలు పట్టుబడుతున్నాయి. కల్తీపాల తయారీకి మూలకారణమైన పాలపొడి అక్రమంగా దిగుమతి అవుతున్నట్లు స్పష్టంగా తెలుస్తున్నప్పటికీ అక్రమార్కులను వదిలేస్తున్నారు. కల్తీపాలు తయారుచేస్తూ పట్టుపడిన వారిపై నామమాత్రపు కేసులు పెట్టి వదిలేస్తున్నారు. దీంతో ఈ అక్రమవ్యాపారం ముమ్మరంగా జరుగుతుంది. ఈక్రమంలో మార్కెట్‌లో పాలు కొనుగోలు చేసేందుకు ప్రజలు భయపడుతున్నారు. కొంతమంది పాలశీతలకేంద్రం నిర్వాహకులు కూడా కల్తీపాల వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్నారు. పాలు కొనుగోలుచేసే సమయంలో ల్యాక్టో మీటరుతో తనిఖీ చేసి పాల స్వచ్ఛతను గుర్తించి కొనుగోలుచేయాలి. కల్తీపాలు తక్కువ ధరకు వస్తున్నందున పాలశీతల కేంద్రాల నిర్వాహకులు కల్తీపాలనే కొనుగోలు చేస్తున్నారు. నిత్యం కల్తీ వ్యాపారం జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు అక్రమ వ్యాపారాన్ని అరికట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదకరమని తెలిసినా..

దొనకొండ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. దొనకొండ స్టేషన్‌లో రైలు ఎక్కేందుకు చిన్నారులను ఎత్తుకొని కొందరు మహిళలు, వృద్ధులు సైతం ప్రమాదమని తెలిసినా పట్టించుకోకుండా పట్టాలు దాటుతున్నారు. ప్లాట్‌ఫాంలు మారేందుకు ఫుట్ ఓవర్‌బ్రిడ్జి ఏర్పాటుచేసినా ప్రయాణికులు పట్టాలను దాటుతున్నారు. గతంలో ఇరువురు మహిళలు పట్టాలు దాటుతున్న క్రమంలో గూడ్స్‌రైలు వేగంగా రావటంతో ప్రమాదానికి గురయ్యారు. దొనకొండ స్టేషన్‌లో టికెట్లు ఇచ్చే బుకింగ్ కార్యాలయం 1వ నెంబర్ ప్లాట్‌ఫాంపై ఉంది. గుంటూరు వైపు వెళ్లే రైళ్లు మూడవ నెంబర్ ప్లాట్‌ఫాంపైకి వస్తుంటాయి. దీంతో ప్రయాణికులు రైలు ఎక్కాలనే ఆతృతతో రైల్వే రక్షకదళం సిబ్బంది హెచ్చరికలు చేస్తున్నా పట్టించుకోకుండా హడావుడిగా రైలు పట్టాలు దాటుతున్నారు. దీంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు.


దొనకొండ స్టేషన్‌లో రైలు పట్టాలు దాటుతున్న ప్రయాణికులు

కోళ్ల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి


బల్లిపల్లి అడ్డరోడ్డు వద్ద ఉన్న కోళ్ల పెంపకం దారుడికి అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి బాలకృష్ణ

కనిగిరి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ వైరస్ పట్ల కోళ్ళ పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి డాక్టర్ బి.బాలకృష్ణ అన్నారు. మండలంలోని బల్లిపల్లి, చాకిరాల ప్రాంతాల్లో ఉన్న కోళ్ళ ఫారాలను ఆదివారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా పెంపకందారులకు బర్డ్‌ఫ్లూ వైరస్ పట్ల అవగాహన కల్పించారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఈవ్యాధి సోకిందన్నారు. మన జిల్లాలో అలాంటి కేసులు నమోదు కాలేదని చెప్పారు. పెంపకందారులు కోళ్ళకు వైరస్ సోకకుండా వైద్యాధికారుల సలహాలను తప్పకుండా పాటించాలన్నారు. ఉన్నపళంగా కోళ్ళు మృత్యువాత పడుతుంటే సమాచారం అందించాలని సూచించారు. కోళ్ల ఫారాలలో పరిశుభ్రత పాటించాలన్నారు. ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఒక కోడి నుంచి మరో కోడికి వైరస్ వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ఈవ్యాధి వలస పక్షులు, అడవి పక్షలు ద్వారా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. వలస పక్షులు కనిగిరి ప్రాంతంలో సంచ రించే సందర్భాలు లేవని తెలిపారు. ఉడికించిన గుడ్లు, చికెన్ తినవచ్చునని చెప్పారు.

చిత్రలేఖనంలో రాణించిన బొద్దికూరపాడు విద్యార్థి

తాళ్లూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పీవీఆర్ బాలుర హైస్కూల్‌లో ఆదివారం జరిగిన సబ్‌జూనియర్స్ విభాగం చిత్రలేఖనం పోటీల్లో బొద్దికూరపాడు జిల్లాపరిషత్ హైస్కూల్ విద్యార్థి తృతీయ స్థానం సాధించారు. బాలోత్సవంలో బొద్దికూరపాడు విద్యార్థులు అడవి తల్లికి దం డాలు జానపద పాటతోపాటు పలు నృత్యాలుచేశారు. నాలుగో తరగతికి చెందిన పోలంరెడ్డి జోషిక సాయిశ్రీ చిత్రలేఖనంలో తృతీయ స్థానం సాధిం చడంతో అధికారులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోలంరెడ్డి సుబ్బారెడ్డి, పద్మావతి, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కిందపడి మహిళ మృతి

దొనకొండ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ క్రిందపడి మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని నల్లబోతులవారిపాలెంలో ఆదివారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఆలా రవణమ్మ(40) కౌలుకు తీసుకున్న పొలంలో పండించిన పొగాకును ట్రాక్టర్‌లో ఇంటికి తరలిస్తున్నారు. ట్రాక్టర్ సైడుడోరుపై కూర్చొని ఆమె వస్తున్నారు. ఈక్రమంలో ట్రాక్టర్ గుంతలో పడటంతో రవణమ్మ ట్రాక్టర్ టైరు కిందపడి అక్కడికక్కడే మృతిచెందింది. రవణమ్మకు భర్త కోటయ్య ఇటీవల గుండెపోటుకు గురై మృతిచెందాడు. రవణమ్మకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది. సమాచారం తెలుసుకున్న ఎస్సై త్యాగరాజు సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యోగాతో ఆరోగ్యం

పామూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగా, ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని పిరమిడ్ మాస్టర్ ఓబయ్య తెలిపారు. స్థానిక శ్రీపత్రిసాయి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తులసీదళం పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పి.అల్లూరయ్య, ఎం.తిరుపతిరెడ్డి, గుత్తి రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కాలువలో మృతదేహం కోసం గాలింపు

కురిచేడు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): త్రిపురాంతకం తహసీల్దార్ కార్యాలయంలో మిట్టపాలెం వీఆర్వోగా పనిచేస్తున్న పాలుట్ల నాగరాజు సాగర్ కాలువలో గల్లంతయ్యారనే అనుమానంతో త్రిపురాంతకం పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది ఆదివారం గాలించారు. సాగర్ ప్రధాన కాలువలో త్రిపురాంతకం వద్ద నుంచి కురిచేడు సమీపంలోని ప్రధాన కాలువ, దర్శి బ్రాంచి కాలువలో పెద్దవరం వరకు వెతికారు. ప్రత్యేక బోటులో సాయంత్రం చీకటి పడే సమయానికి పెద్దవరం వరకు గాలించారు. ఆచూకీ లభ్యమైనట్టు సమాచారం లేదు.

ఆచూకీ తెలియని వ్యక్తి మృతదేహం గుర్తింపు

కనిగిరి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కొండపై గుర్తుతెలియన వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఈ మృతదేహం పొదిలి ప్రాంతంలోని దేవసహాయంగా (72) నిర్ధారించినట్లు సీఐ ఖాజావలి తెలిపారు. పొదిలి ప్రాంతానికి చెందిన మృతుడు దేవసహాయం ఈనెల ఒకటో తేదీన ప్రభుత్వ భరోసా పింఛన్ తీసుకున్నాడు. వృద్ధాప్యంతో మృతునికి మతిస్థిమితం సరిగా లేదు. కొండపైకి వెళ్ళిన మృతుడు జారిపడి ముళ్ళపొదల్లో పడటంతో చనిపోయి ఉంటాడని సీఐ తెలిపారు. మృతదేహం వద్ద లభించిన ఫొటో కలిగిన వ్యక్తి పోలీసులను ఆశ్రయించి తాను బతికే ఉన్నానని, పొదిలి పట్టణానికి చెందిన వాడినని చెప్పాడు. మృతుడు కూడా పొదిలి వాసి అని కుటుంబ సభ్యులకు సమాచారం తెలిపారు. బంధువులు మృతదేహాన్ని పరిశీలించి దేవసహాయంగా గుర్తించినట్లు సీఐ తెలిపారు. మృతికి కారణాలు తెలియ రాలేదని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.





కొత్త కార్డులు ఎప్పుడు?



రేషన్ కార్డుల గండం.. నిలువ నీడ లేని నిరుపేదలకు సొంత ఇల్లు అనేది తీరని కల. ప్రభుత్వం ఆ కలను తీర్చడానికి పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, పక్కా ఇళ్లు నిర్మించుకు నేందుకు చేదోడుగా సహాయం అంది స్తోంది. అయినప్పటికీ అనే క మంది పేదలు తమ సొంతింటి కలను నెరవేర్చు కోలేకపోతున్నారు. అందుకు కారణం వారికి ప్రభుత్వం జారీ చేసే రేషన్ కార్డు లేకపోవడమే!

ఒక జంట నాలుగేళ్ల క్రితం పెళ్లిచేసుకుంది. గత ప్రభుత్వ హయాంలో వారికి రేషన్ కార్డు రాలేదు. అదే ఇప్పుడు వారికి శాపంగా మారింది. కార్డు లేని కారణంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న పీఎంఏవై- 2.0 సర్వేలో అతడు అనర్హతకు గురయ్యాడు.

మరొకరు పీఎంఏవై- 2.0లో పేరు నమోదు చేసుకునేందుకు ప్రయత్నించారు. ఆధార్ నెంబర్ ఇచ్చారు. రేషన్‌కార్డు నెంబరు ఇచ్చారు. అయితే అది అతడి తల్లిదండ్రుల పేరుతో ఉంది. ఆ కార్డు లోని సభ్యుల్లో ఒకరికి ఇల్లు ఉంది. దీంతో అతడు అనర్హుడయ్యాడు. ఇలా ఎంతో మంది పీఎంఏవై- 2.0 సర్వేలో అనర్హత బారిన పడుతున్నారు.

- పేదల సొంతింటి ఆశలపై నీళ్లు
- రేషన్‌కార్డులు లేకపోవడంతో అనర్హత వేటు
- పీఎంఏవై-2 సర్వేలో స్థానం కోల్పోతున్న నిరుపేదలు
- ఇప్పటికే పింఛన్లు, సంక్షేమ పథకాలకు దూరమైన వైనం
- ఏడాదిన్నర క్రితం ఆగిపోయిన దరఖాస్తుల ప్రక్రియ
- 8 నెలలైనా ఊసే లేని కార్డుల వ్యవహారం

గుంటూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నీడలేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతోపాటు, ఇళ్లు కట్టించి ఇచ్చేందుకు చర్యలు చేపడుతోంది. భూమి లేని పేదలకు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు చొప్పున స్థలం కేటాయించి ఇళ్ల నిర్మాణానికి తోడ్పాటునందిస్తానని ప్రకటించింది. ఇళ్ల నిర్మాణానికి రూ. 3.5 లక్షల నుంచి 4 లక్షల వరకూ సహాయం అందజేస్తానని ప్రకటించింది. దీంతో పేదల సొంతింటి ఆశలకు రెక్కలు వచ్చాయి. లబ్ధిదారుల జాబితా రూప కల్పనలో భాగంగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ పీఎంఏవై- 2.0 కింద సర్వే నిర్వహిస్తోంది. దీంతో ఇళ్లు లేని పేదలంతా ఆ సర్వేలో తమ పేర్లు నమోదు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఊహించని రీతిలో వారిలో చాలా మంది అనర్హత బారిన పడుతున్నారు. రేషన్ కార్డులేదనో, కార్డుదారుల్లోని కుటుంబ సభ్యులకు రేషన్ కార్డులు లేని కారణంగా అనేక మంది పేదలు ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాలకు అనర్హత బారిన పడుతున్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న పీఎంఏవై సర్వేలో రేషన్ కార్డు లేని కారణంగా అనర్హతకు వేటు పడుతుండడంతో ఇక తమ సొంతింటి కల నెరవేరదేమోనన్న ఆందోళనకు గురవుతున్నారు.

● **వైసీపీ ప్రభుత్వంలో అన్యాయం..**

గత వైసీపీ ప్రభుత్వం పేదలకు సెంటు పట్టాల పేరుతో చాలీచాలని విధంగా పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర స్థలాలు ఇచ్చింది. తామే ఇళ్లు నిర్మించి ఇస్తా మని చెప్పి ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే రూ. 1.8 లక్షలు తానే ఇచ్చినట్లు ఇచ్చి ప్రజలను వంచించింది. దీంతో ప్రభుత్వం స్థలం ఇచ్చినా అనేక మంది పేదలు నేటికీ ఇళ్లు నిర్మించు కోలేకపోయారు. జగనన్న కాలనీల పేరుతో నిర్మించిన కాలనీల్లో ఇప్పటికీ రెండింట మూడొంతుల ఇళ్లు పూర్తి కావాల్సి ఉంది. అలా ఇళ్లు నిర్మిం చుకోకుండా ఆగిపోయినవారు, ఇప్పటికీ స్థలం లేనివారు ప్రభుత్వం ప్రకటించిన గృహనిర్మాణ పథకం ద్వారా సొంత ఇల్లు నిర్మించుకోవచ్చని ఆశ పడుతున్నారు. ఊహించని రీతిలో రేషన్ కార్డుల సమస్య తలెత్త డంతో వారి ఆశలు ఆవిరైపోతున్నాయి. ప్రభుత్వం గృహ నిర్మాణ పథ కానికి నిజమైన అర్హులుగా ఉండే నిరుపేదలు, దిన కూలీలు, వలస పను లకు వెళ్లేవారిలో చాలామంది వద్ద రేషన్ కార్డులు కూడా ఉండవు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డుల విభజన, కొత్త రేషన్ కార్డుల జారీ లేకపోవడంతో కొత్తగా పెళ్లి చేసుకున్నవారికి ఎవరికీ రేషన్ కార్డులు రాలేదు. దీనికి తోడు రకరకాల కారణాలు చూపి గత వైసీపీ ప్రభుత్వం అనేక మం దికి రేషన్ కార్డులు తొలగించింది. ఇలా అనేక మంది పీఎంఏవై- 2.0లో అన ర్హతకు గురయ్యారు.

● **ఇప్పటికే పలు పథకాలకు దూరం..**

రేషన్ కార్డులు లేని కారణంగా ఇప్పటికే ప్రభుత్వం అందించే పలు సంక్షేమ కార్యక్రమాలకు పేదలు దూరమవుతున్నారు. రేషన్ కార్డులు లేని కార ణంగా అనేక మంది వయోవృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు పింఛనుకు దూరమయ్యారు. దీపం- 2.0 కింద ప్రభుత్వం అందజేసిన ఉచిత గ్యాస్ సిలిండర్ కూడా పొందలేకపోయారు. ప్రభుత్వం నుంచి అందే రేషన్ సరుకులు కూడా పొందలేకపోతున్నారు. తాజాగా పీఎంఏవై- 2.0 సర్వేలో కూడా అనర్హత బారిన పడుతుండడంతో మరింత ఆందోళన చెందుతున్నారు.

● **పెండింగులో 25 వేల దరఖాస్తులు**

గుంటూరు, పల్నాడు, బాపట్ల మూడు జిల్లాల్లో గత వైసీపీ హయాంలో 25వేల దరఖాస్తులు పెండింగులో ఉన్నాయని తెలుస్తోంది. గడిచిన 8 నెలల్లో ఈ సంఖ్య మరో 10 వేల వరకూ పెరిగే అవకాశం ఉంది. దరఖాస్తు ప్రక్రి యకు అవకాశం లేకపోవడంతో ఆ సంఖ్య కచ్చితంగా తెలియడం లేదు. దరఖాస్తు చేసుకున్నవారు, చేసుకోవాలనుకుంటున్న వారు ఎనిమిది నెలలుగా కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నా, ప్రభుత్వం నుంచి కనీస ప్రకటన రావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రేషన్ కార్డులు జారీ చేయాలని వారు వేడుకుంటున్నారు.

రైతులకూ.. గుర్తింపు కార్డు



- ఆధార్ తరహాలో 11 అంకెలతో జారీ
- రైతు సేవా కేంద్రాల్లో నమోదు ప్రక్రియ
- ప్రభుత్వ పథకాలు, సేవల లబ్ధికి అవసరం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

దేశంలోని ప్రతిఒక్కరికీ ఆధార్ గుర్తింపు కార్డు ఉంది. అలాగే రైతులందరికీ కూడా గుర్తింపు కార్డు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఈ క్రమంలో 11 అంకెలతో కలిగిన కార్డు జారీ చేసేందుకు వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది. నమోదు, కార్డుల జారీ ప్రక్రియకు రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. సంక్షేమ పథకాలు, పంట నష్టం, బీమా పరిహారం, రైతులకు అందించే వివిధ సేవల కోసం ప్రత్యేకంగా కార్డును జారీ చేయనున్నారు. పొలం కలిగిన ప్రతి ఒక్కరికీ ఫార్మర్ రిజిష్టర్ పేరుతో నిర్దిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వనున్నారు. ప్రభుత్వ పథకాలు, సేవలను సులభంగా, పారదర్శకం గా నేరుగా రైతులకు అందించేందుకు కార్డులు ఉపయోగ పడనున్నాయి. పీఎం కిసాన్ పథకం లబ్ధిదారులందరికీ ఈ గుర్తింపు కార్డు జారీ చేసే లక్ష్యంగా నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సంఖ్య ప్రామాణికం కానున్న నేపథ్యంలో రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. పల్నాడు జిల్లాలో 2.59 లక్షల మంది, బాపట్ల జిల్లాలో 1.92 లక్షలు, గుంటూరు జిల్లాలో 1.26 లక్షల మంది రైతుల పేర్లను ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో నమోదు చేసే ప్రక్రియను వ్యవసాయ శాఖ ప్రారంభించింది. రైతులు తగు ధ్రువ పత్రాలతో వివరాలు నమోదు చేసుకుని గుర్తింపు కార్డు పొందాలని పల్నాడు జిల్లా జేడీ మురళి సూచించారు. భూమి కలిగిన ప్రతి రైతూ ముందుకొచ్చి విశిష్ట సంఖ్య కోసం వివరాల నమోదుకు వ్యవసాయ శాఖకు రైతులు సహకరించాలని కోరారు.

నమోదు ఇలా..

రైతులకు గుర్తింపు కార్డు జారీ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. రైతు సేవా కేంద్రాల్లో రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి. ఆధార్, పట్టాదారు పుస్తకాల జిరాక్స్‌లను గ్రామ వ్యవసాయ సహాయకుడికి అందించాలి. ఆ వివరాలను వీఏఏ ఆన్‌లైన్లో నమోదు చేస్తారు. రైతు మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ నెంబర్ వీఏఏ లాగిన్ ద్వారా వివరా లను సరిచూస్తారు. పట్టాదారు పాసుపుస్తకాల్లో ఉన్న వివరాలు సరిపోలితే 11 అంకెల ప్రత్యేక గుర్తింపు కార్డును సంబంధిత రైతు పేరిట నమోదు చేస్తారు. ఒకవేళ రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో లేకపోతే వీఆర్వో లాగిన్‌కు వెళ్తుంది. వీఆర్వో దానిని పరిశీలించి తహసీల్దార్‌కు వివరాలు అందజేస్తారు. తప్పులు ఉంటే రికార్డుల మేరకు సరిచేసిన తర్వాత వీఏఏకు పంపిస్తారు. ఆ తర్వాత నమోదు ప్రక్రియ కొనసాగుతోంది.



పల్నాడు జిల్లాలో గుర్తింపు కార్డు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జేడీ మురళి

ప్రయోజనాలు..

రైతులకు విశిష్ట గుర్తింపు కార్డు ద్వారా ఎన్నో ప్రయోజనాలు కలగనున్నాయి. పీఎం కిసాన్ చెల్లింపులు, రైతు సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, వ్యవసాయ పరికరాలు తదితరాలను రైతు నేరుగా పొందే అవకాశం ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే సత్వరమే పరిహారం అందించేందుకు అవకాశం ఉంటోంది. నీటిపారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి సేవలు పొందవచ్చు. వాతావరణంలో మార్పులపై రైతులకు ఎప్ప టికప్పుడు సమాచారాన్ని అందించి అప్రమ త్తం చేసేందుకు ఈ కార్డులు ఉపయోగపడనున్నాయి.

ముగ్గుర్ని కబళించిన ట్యాంకర్



- నెమలిపురి వద్ద రోడ్డు ప్రమాదం
- ప్రమాదంలో తల్లీ, ఇద్దరు కుమారులు మృతి
- హైదరాబాద్ నుంచి కారులో చీమకుర్తికి వస్తుండగా ఘటన

రాజుపాలెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వారంతా ఒకే కుటుంబ సభ్యులు. హైదరాబాద్‌లో పిల్లలు ఉద్యోగం చేస్తుండగా వారితో తల్లి ఆనందంగా జీవనాన్ని సాగిస్తున్నది. వారిని చూసి విధికి కన్ను కుట్టిందేమో ట్యాంకర్ రూపంలో మృత్యువు కబళించింది. భర్తకు కిడ్నీ దానం చేసి బతికించుకున్న భార్య. తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకుంటున్న కుమారులతో ఆ కుటుంబంలో రోడ్డు ప్రమాదం పెనువిపత్తు సంభవించింది. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన షేక్ నజీమ(46)కు భర్త, ఇద్దరు కుమారులు. కాగా పెద్ద కుమారుడు షేక్ నూరుల్లా(26), చిన్న కుమారుడు షేక్ హబీబుల్లా(24) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా హైదరాబాదులో ఉద్యోగం చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు వారితోనే కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో నూరుల్లా భార్య నబ్సిన్ గర్భిణీ కావడంతో సీమంతానికని హైదరాబాద్ నుంచి సొంత కారులో తల్లి, సోదరుడుతో కలిసి ప్రకాశం జిల్లా పెద్దకొత్తపల్లికి బయలుదేరారు. ఆదివారం తెల్లవారుజామున అద్దంకి - నార్కెట్‌పల్లి రహదారిపై రాజుపాలెం మండలం నెమలిపురి వద్దకు వీరు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న సిమెంట్ ట్యాంకర్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఆపై అతివేగంగా వచ్చి కారుపై పడింది. దీంతో కారు నుజ్జునుజ్జవగా అందులోని నజీమ, హబీబుల్లాలు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన నూరుల్లాను చికిత్స నిమిత్తం నరసరావుపేట తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై రాజుపాలెం ఎస్ఐ వేణుగోపాల్ కేసు నమోదు చేశారు.



నజీమా, షేక్ హబీబుల్లా



నుజ్జునుజ్జయిన కారు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కె శ్రీనివాసరావు

ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

నెమలిపురి శివారులో జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని ఎస్పీ కంచి శ్రీనివాసరావు, డీటీవో సంజయ్ కుమార్, పిడుగురాళ్ల ఎంవీఐ రాంబాబు, హైవే ఇంజనీర్ రామ కృష్ణలతో కలిసి పరిశీలిం చారు. ప్రమా దానికి గల కారణాలను సత్తెనపల్లి రూరల్ సీఐ సుబ్బారావు, రాజుపాలెం ఎస్ఐ వేణుగోపాల్ ఎస్పీకి వివరిం చారు. గంటకు పైగా సం ఘ ట నా స్థలం వద్ద ఉండి ప్రమాదాల నివా రణకు ఎలాంటి చర్యలు చేపడితే ప్రమాదాలు జరగకుండా ఉంటాయోనని ఎస్పీ అధికారులతో చర్చించారు. మూలమలుపు ప్రాంతాల్లో బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో వాహనాలను తనిఖీ చేసి మద్యం తాగిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

గుర్తు తెలియని వాహనాలు ఢీ..

దేచవరం వద్ద విద్యార్థి.. రేమిడిచర్లలో యువకుడు మృతి



సుమంత్ (పాత చిత్రం)

నకరికల్లు, బొల్లాపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి చెందిన సంఘటనలు నకరికల్లు, బొల్లాపల్లి మండలాల పరిధిలో చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గి మండలం అడిగొప్పుల గ్రామానికి చెందిన వేల్పూరి నాగేశ్వరరావు కసుకుర్తి సుమంత్ బైక్‌పై నరసరావుపేటకు వస్తున్నారు. నకరికల్లు మండలం దేచవరం మిద్దెకు ఒక కిలో మీటరు దూరంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం నాగేశ్వరరావు, సుమంత్‌లు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుమంత్(16) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావును పోలీసులు నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. మృతుడు సుమంత్ తండ్రి కుసుకుర్తి నాగరాజు ఫిర్యాదు మేరకు ఎస్ఐ చల్లా సురేష్ కేసు నమోదు చేశారు. సుమంత్ నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బొల్లాపల్లి మండలం రేమిడిచర్ల, రావులాపురం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని నల్గొండ జిల్లాకు చెందిన చిన్న(25) అనే యువకుడు మృతి చెందాడు. నల్గొండ జిల్లా గణేష్ నగరానికి చెందిన చిన్న బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడులో మిరప కూలి పనులకు వచ్చాడు. రావులాపురం - రేమిడిచర్ల మధ్యలో బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మండలి ప్రచారంలో.. కూటమి జోరు

అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా ఎమ్మెల్యేలకు బాధ్యతలు

- ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా నేతలతో సీఎం టెలీకాన్ఫరెన్స్
- సమన్వయంతో పని చేసి ఆలపాటిని గెలిపించాలని దిశా నిర్దేశం
- నేడు విజయవాడలో సమావేశం అవుతున్న జనసేన నేతలు

గుంటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గం ఎన్నికల ప్రచారంలో ఎన్‌డీఏ కూటమి స్పీడు పెంచింది. ఇప్పటికే అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా బాధ్యతలు తీసుకున్న కూటమి ఎమ్మెల్యేలు, ఇతర నేతలు విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఓటర్ స్లిప్పుల పంపిణీకి కూడా శ్రీకారం చుట్టారు. కాగా సీఎం చంద్రబాబునాయుడు రెండు జిల్లాల నేతలతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికలు మరో 10 రోజుల్లోకి వచ్చేసినందున టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నేతలు నిత్యం ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరచా లన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో నేతలు తమ నియోజకవర్గాల పరిధిలో డోర్ టూ డోర్ ప్రచారాలను ప్రారం భించారు. ఓటరు స్లిప్పులు పంచు తూ నేరుగా పట్టభద్రుల ఓటర్ల ను కలుసుకుం టున్నారు. తాము ఏమే మి చేయ బోయేది వివరించి చెబుతున్నారు. కాగా ఇప్పటివరకు అంతంత మా త్రంగానే ప్రచారంలో ఉన్న జనసేన, బీజేపీలు కూడా సోమవారం నుంచి విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించ బోతున్నాయి. మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన సోమవారం విజయవాడలో జనసేన సమావేశం ఏర్పాటు చేసింది. అలానే బీజేపీ నాయకులు కూడా సమావేశమై కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం ప్రచారంలోకి దిగనున్నారు.



యూనివర్సిటీ వద్ద రెయిన్ ట్రీ పార్కులో ప్రచారంలో పాల్గొన్న ఉమ

సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. నేతలు కూటమి ధర్మాన్ని పాటిస్తూ విజయం కోసం కష్టపడాలన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలో అన్ని అసెంబ్లీ, లోక్‌సభ సీట్లను గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. మెజార్టీలు కూడా భారీగా వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆ ఎన్నికల్లో కంటే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మెజార్టీ మరింత మెరుగ్గా రావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రజలకు కూటమిపై నమ్మకం ఉండటం వల్లే సార్వత్రిక ఎన్నికల్లో 93 శాతం స్ట్రయిక్ రేట్ ఇచ్చారన్నారు. 16,347 టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వబోతున్నామని, గత ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో పెట్టిన రూ.780 కోట్లు చెల్లించామని, ఉద్యోగులు, పింఛన్‌దారులకు ప్రతీ నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామన్న అంశాలను

గుంటూరులో.. ఇద్దరు మృతి

● ట్యాంకర్ ఢీకొని వృద్ధురాలు.. డివైడర్‌ను ఢీకొని యువకుడు

గుంటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో ఆదివారం ఒక్కరోజు రెండు ప్రమాద దుర్ఘటనలు చోటుచేసుకోగా ఇద్దరు మృతి చెందారు. సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ ట్యాంకర్ ఢీకొని దంటు కమల(70) అనే వృద్ధురాలు మృతి చెందగా, ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని చింతా రాము(20) అనే మరో యువకుడు మృతి చెందాడు. ప్రమాదాలకు సంబంధించి వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య తెలిపిన వివరాలు.. పట్టాభిపురం రెండో లైన్‌కి చెందిన కమల అనే వృద్ధురాలు స్థానికంగా సాయి సునంద అపార్ట్మెంట్లో ఒంటరిగా నివాసం ఉంటున్నారు. ఆదివారం ఉదయం ఆమె పట్టాభిపురం మెయిన్ రోడ్డులో పాలు పాలు తీసుకుని ఇంటికి వెళుతుండగా పెట్రోల్ బంకులో నుంచి వచ్చిన సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనం ఆమెను ఢీకొట్టింది. దీంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాదులో ఉంటున్న ఆమె మరిది కృష్ణప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

● అరండల్‌పేట మెయిన్ రోడ్డుపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో డెలివరీ బాయ్ చింతా రాము మృతి చెందాడు. బాపట్ల జిల్లా చినగంజాం మండలం పెద్దపల్లెపాలెం గ్రామానికి చెందిన చింతా రాము అమరావతి రోడ్డులో ఉంటూ కొత్తపేటలోని కుగ్లర్ ఆస్పత్రి పక్కన ఉన్న ఓ డెంటల్ క్లినిక్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నారు. అతడు బ్రాడీపేటలో డెలివరీ ఇచ్చి తిరిగి ఆస్పత్రికి వెళుతుండగా అరండల్ పేట మెయిన్ రోడ్డుపై ఆరోలైన్ వద్ద మీదకు వస్తున్న ఆటోని తప్పించేందుకు ప్రయత్నించగా డివైడర్‌ను ఢీకొట్టాడు. డివైడర్‌పై పడిన రాముకు ఇనుప రైలింగ్ బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

నిరుపయోగంగా 'ఎత్తిపోతల'

- శింగరకొండపాలెం పథకం వినియోగంలోకి వచ్చేదెప్పుడో
- 4 దశాబ్దాల కిందట నిర్మాణం
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.70లక్షలతో మరమ్మతులు
- వైసీపీ వచ్చాక నిర్వహణ గాలికి
- కూటమి ప్రభుత్వంపై గంపెడాశలతో రైతులు



నిరుపయోగంగా ఉన్న శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం .. ఉపయోగం లేకుండా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు

అద్దంకి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సాగర్ ఆయకట్టు చివరలో ఉన్న భూములకు ఆరుతడి పంటలకు నీటి వసతి కల్పించాలన్న ఉన్నత ఆశయంతో 4 దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన శింగరకొండ పాలెం ఎత్తిపోతల పథకం మూలనపడింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.70కోట్లు వెచ్చించి మరమ్మతులు పూర్తి చేసినా తర్వాత వచ్చిన వైసీపీ కనీసం నిర్వహణపై కూడా దృష్టి సారించకపోవడంతో మూలనపడింది. టీడీపీ ప్రభుత్వం తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడు రైతులకు సాగునీటి వసతి పెంచాలన్న ఉద్దేశంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పెద్దఎత్తున ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో అద్దంకి మండలంలోని శింగరకొండపాలెం వద్ద భవనాసి చెరువు నీరు ఆధారంగా 4 దశాబ్దాల క్రితం శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టారు. సుమారు 3229 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించే లక్ష్యంతో శింగరకొండపాలెం వద్ద ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ నుంచి నేలల్లో సుమారు 2కి.మీ దూరం పైప్ లైన్‌లు వేసి అద్దంకి మేజర్‌లో నీరు పడే విధంగా ఏర్పాటు చేశారు. అద్దంకి మేజర్‌లో చివరి ఆయకట్టుగా ఉన్న కలవకూరు, బొమ్మనంపాడు, శింగరకొండపాలెం, గోపాలపురం, ఉత్తర అద్దంకి, దక్షిణ అద్దంకి, వేలమూరిపాడు,నాగులపాడు తదితర గ్రామాల రైతుల పంట పొలాలకు నీరు అందేలా ఏర్పాటు చేశారు. అయితే కొంతకాలం పాటు పనిచేసిన ఎత్తిపోతల పథకం అనంతరం తరచూ మరమ్మతులకు గురవుతూ నిరుపయోగంగా మారింది. దీంతో గత టీడీపీ ప్రభుత్వంలో సుమారు 70 లక్షల రూపాయలతో కొత్త విద్యుత్ మోటార్‌లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశారు. నీటి విడుదల జరిగింది. అయితే ఎత్తిపోతల పథకం నుంచి అద్దంకి మేజర్ కాలువ వరకు ఉన్న పైప్‌లైన్ లీకులు కావడంతో ఆశించిన ఫలితం రాలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కనీస నిర్వహణపై కూడా దృష్టి పెట్టక పోవడంతో 5 సంవత్సరాల పాటు పూర్తిగా మూలన పడింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన ప్రారంభంలో ఎత్తిపోతల పథకం వద్ద హడావుడి చేసిన వైసీపీ నేతలు ఆ తరువాత అటువైపు కూడా కన్నెత్తి కూడా చూడలేదు. దీంతో గత 5 సంవత్సరాలుగా ఎత్తిపోతల పథకం తలుపులు కూడా తీసిన పాపానపోలేదు. దీంతో ఎత్తిపోతల పథకం మరలా అటకెక్కింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రకటించడంతో రైతులలో ఆశలు చిగురించాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు దాటడంతో రైతులలో ఎదురు చూపులు మొదలయ్యాయి. భవనాసి చెరువును రిజర్వాయర్‌గా మారుస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ఎత్తిపోతల పథకం ముంపునకు గురయ్యే అవకాశం ఉండడంతో పునఃనిర్మాణం చేస్తేనే ప్రయోజనం ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో ఎత్తిపోతల పథకం స్థాయిని పెంచి పమిడిపాడు మేజర్ వరకు పొడిగిస్తే అద్దంకి, పంగులూరు, కొరిశపాడు మండలాలలోని సాగర్ ఆయకట్టులో ఉన్న సుమారు 20 గ్రామాల పంట పొలాలకు నీటి వసతి పెరగడంతో పాటు ఆయా గ్రామాలకు మంచి నీటి వసతి మెరుగు పరిచే అవకాశం ఉంటుందని పలు గ్రామాల రైతులు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయంపై మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



భవనాసి చెరువు నిండుగా ఉన్న నీరు

వైభవంగా వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో వరసిద్ధి వినాయక స్వామి

బల్లికురవ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ గ్రామంలో ఉన్న వరసిద్ధి వినాయక స్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సం ఆదివారం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున చేరి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో వినాయక స్వామి వారిని దర్శించుకొన్నారు. గ్రామానికి చెందిన భక్తులు స్వామి ఉత్సవ విగ్రహాలను ఈసందర్భంగా అందజేశారు. అనంతరం దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రికి ప్రత్యేక భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

త్రివిక్రమస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

చెరుకూరు(పర్చూరు), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలోని శ్రీ త్రివిక్రమ అగస్థేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన పూజల్లో చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన్ని ఆలయ అధికారి ఎం.నాగయ్య నేతృత్వంలో అర్చకులు ఘనస్వాగతం పలికారు.

తాగునీటి చెరువులను అభివృద్ధి చేయండి



కట్టావారిపాలెం చెరువును పరిశీలిస్తున్న అధికారులు

ఇంకొల్లు,ఫిబ్రవరి 16,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణికి గ్రామపంచాయతీ పరిధిలోని కట్టావారిపాలెం తాగునీటి చెరువును అభివృద్ధి చేయాలని సర్పంచ్ గుది కుమారి, ఆదెయ్య అధికారులను విన్నవించారు. చెరువులో నీరు పూర్తిగా కలుషితమై రంగుమారి వాడుకునేందుకు వీలులేకుండా ఉండడంతో ఆ చెరువును పంచాయతీ కార్యదర్శి అడ్డగడ వెంకటేశ్వర్లు పరిశీలించారు. నీటి స్యాంపిల్‌ను ల్యాబ్‌కు పంపుతామన్నారు. ప్రస్తుతం బ్లీచింగ్, సున్నంను చెరువులో చల్లించారు. చెరువులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకోవాని కోరారు.

గ్రామీణ రహదారులు బాగు

చినగంజాం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పల్లెలోని అంతర్గత రహదారులకు మహర్దశ పట్టింది. గత వైసీపీ పల్లె రహదారుల అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడంతో అన్నీ అస్తవ్యస్తంగా మారాయి. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఎన్నికల్లో గెలుపొందిన వెంటనే గ్రామీణ రోడ్లపై దృష్టి సారించారు. గ్రామాల్లో అంతర్గత రోడ్లను సిమెంట్ రోడ్లగా నిర్మించేందుకు ఉపాధి పథకం ద్వారా నిధులు మంజూరు చేసి పనులు కొనసాగించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఉపాధి నిధులతో మండల పరిధిలోని గ్రామాల్లో సిమెంట్ రహదారులు, అత్యవసర రహదారులను నిర్మిస్తుండడంతో ప్రజల నుంచి హర్షాతిరేకులు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన 7 నెలల్లోనే మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో ఉపాధి నిధులు రూ.4.53కోట్లతో, 5.3కిలోమీటర్ల పొడవున 35 అంతర్గత రహదారులను నిర్మించారు. మండలంలోని నీలాయపాలెంలో రూ.15లక్షలతో 302 మీటర్లు, గొనసపూడిలో రూ.41.5లక్షలతో 600 మీటర్లు, పెదగంజాంలో రూ.55లక్షలతో 760 మీటర్లు, చినగంజాంలో రూ.89.5లక్షలతో 1200 మీటర్లు, కడవకుదురులో రూ.65లక్షలతో 915 మీటర్లు, మోటుపల్లిలో రూ.85లక్షలతో 402 మీటర్లు, పల్లెపాలెంలో రూ.17 లక్షలతో 255 మీటర్లు, చింతగుంపల్లిలో రూ.19లక్షలతో 275 మీటర్లు, సంతరావూరులో రూ.59లక్షలతో 200 మీటర్ల సిమెంట్ రోడ్లను పూర్తి చేశారు. 35 అంతర్గత రహదారులకు గాను 27 రహదారులను పూర్తి చేసినట్లు పంచాయతీరాజ్ ఏఈ దండమూడి దాసు తెలిపారు. ఇటీవల క్వాలిటీ కంట్రోల్ అధికారులు గ్రామాల్లో పూర్తి చేసిన సిమెంట్ రోడ్ల నాణ్యతను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సహకారంతో చినగంజాం గ్రామ పంచాయతీ అభివృద్ధి పథంలో నడుస్తుందని సర్పంచ్ రాయని ఆత్మారావు అన్నారు. గతంలో ప్రయాణించాలంటే నరక ప్రాయంగా ఉండేదని, ఏలూరి చొరవతో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు జరగడంతో అవస్థలు తప్పినాయని మండల ప్రజలు అంటున్నారన్నారు.



సోపిరాలలో నూతనంగా వేసిన సిమెంట్ రోడ్డు

క్లోరినేషన్ నీటిని సరఫరా చేయాలి

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్ చంద్ర



అన్నంబొట్లవారిపాలెం వాటర్ స్కీం వద్ద చేపట్టిన క్లోరినేషన్‌ను పరిశీలిస్తున్న డీఈ సతీష్‌చంద్ర

పర్చూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : బాక్టీరియా, వైరస్‌వల్ల ప్రజలు రోగాలబారిన పడకుండా విధిగా నీటిని క్లోరినేషన్ చేసిన తర్వా సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్‌చంద్ర అన్నారు. పంచాయతీ కొళాయిల ద్వారా సరఫరా చేసే నీటిని విధిగా క్లోరినేషన్ చేసిన తరువాతనే విడుదల చేయాలన్నారు. ఆదివారం మండలంలోని అన్నబొట్లవారిపాలెం వాటర్ స్కీంను సందర్శించి, క్లోరినేషన్ చేస్తున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. మహారాష్ట్రలోని పూనే, షోలాపూర్ జిల్లాలో జీబీఎస్ వ్యాధి కలకలం సృష్టిస్తోందన్నారు. దీని ప్రభావంతో మరణాలు కూడా సంభవించాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లోని నీటి శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

మంచినీటి చెరువుల పరిశీలన

మార్టూరు : మార్టూరు రక్షిత మంచి నీటి చెరువును, అదేవిధంగా యద్దనపూడి మండలంలోని యద్దనపూడి, తనుబొద్దివారిపాలెం, పడమర పెద్దివారిపాలెం గ్రామాలకు చెందిన మంచినీటి చెరువులను ఆదివారం పర్చూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్‌చంద్ర, యద్దనపూడి ఏఈ బ్రహ్మయ్య పరిశీలించారు. చెరువులు సమీపంలో ఎలాంటి వ్యర్థాలు ఉండకూడదని, తరచూ క్లోరినేషన్ చేయాలని, ప్రజలకు సరఫరా చేసే తాగునీటిలో ఎలాంటి కలుషిత పదార్థాలు లేకుండా తీసుకోవల్సిన చర్యలపై పంచాయతీ సిబ్బందికి వారు సూచనలు చేశారు. అదేవిధంగా మార్టూరు చెరువులో అధికారులు దగ్గరుండి క్లోరినేషను చేయించారు. ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ సిబ్బంది చెరువునీటిని క్లోరినేషను చేయడంలో నిర్లక్ష్యవైఖరితో ఉండరాదన్నారు.

విద్యార్థి దశ నుంచే కరాటే శిక్షణ అవసరం





కరాటే పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు.. వివిధ విభాగాల కరాటే విజేతలకు బహుమతులను అందజేస్తున్న ప్రముఖులు


అద్దంకి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ కరాటే శిక్షణ తీసుకోవాలని రాష్ట్ర అసోసియేషన్ చైర్మన్ చిన్ని మురళీకృష్ణ అన్నారు. ఆర్‌బీ డ్రాగన్స్ షటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అద్దంకి పట్టణంలోని గీతామందిరంలో జాతీయ స్థాయిలో ఓపెన్ కరాటే కుంగ్‌ఫూ టైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. పోటీలను చీఫ్ ఆర్గనైజర్ పి.రాంబాబు, ఆల్ ఇండియా అధ్యక్షుడు సాయిరాం ఆధ్వర్యంలో నిర్వహించారు. మొత్తం 6 రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, యానాం రాష్ట్రాల నుంచి సుమారు 650 మంది పాల్గొన్నారు. ఓవరాల్ చాంపియన్స్‌గా నర్సారావుపేట టీం విజయం సాధించింది. వివిధ విభాగాలలో విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు, సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు వీరయ్య, చిన్ని శ్రీనివాసరావు, ఏసీటీవో సీతారామయ్య, అశోక్, పూర్ణచంద్రరావు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శ్రీనివాసరావు, కరాటే మాస్టర్ వెంకటరత్నం పాల్గొన్నారు.

డమ్మీ నోట్లతో మోసం

ముగ్గురిపై ఫిర్యాదు

మేదరమెట్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : లక్షకు మూడు లక్షలు నల్లధనం ఇస్తామని నమ్మించి డమ్మీ నోట్లతో మోసం చేసిన ఘటన మేదరమెట్లలో జరిగింది. జనవరి 27వ తేదీన అనంతపురం జిల్లా తాడిపత్రి చెందిన మాదాసి నరేంద్ర, అద్దంకి పట్టణానికి చెందిన సురేష్, ఏసురత్నం కడపకు చెందిన రామేశ్వరరెడ్డికి లక్షకు మూడు లక్షలు నల్లధనం ఇస్తామని మేదరమెట్ల పిలిపించారు. రామేశ్వరరెడ్డి నుంచి రూ.2లక్షలు ఒరిజినల్ నోట్లు తీసుకొని రూ.6లక్షల డమ్మీ నోట్ల కట్టలను ఇచ్చారు. ఒక్కోకట్టపై రెండు ఒరిజినల్ రూ.500 నోట్లను పైన, కింద పెట్టి ఇచ్చారు. రామేశ్వరరెడ్డి తర్వాత నోట్లను పరిశీలించి, అవి డమ్మీ నోట్లుగా గుర్తించారు. ఫిబ్రవరి 14న మేదరమెట్ల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి మాదాసి నరేంద్ర, అతనికి సహకరించిన సురేష్, ఏసురత్నంపై ఫిర్యాదు చేశాడు. మేదరమెట్ల ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసి వారు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు. వారి వద్ద డమ్మీ 500 రూపాయల నోట్లు పది, రూ.40వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కళలు దైవదత్తాలు



నాగేశ్వరరావుకు కళాపురస్కారాన్ని అందజేస్తున్న సభ్యులు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కళలు దైవదత్తాలని, సాధనతో అవి ప్రకాశిస్తాయని వారణాసి రఘురామశర్మ అన్నారు. ఆదివారం స్థానిక పుట్టంరాజు కళాక్షేత్రంలో సాహితీ కౌముది ఆధ్వర్యంలో అభినయ శ్రీహరి అద్దంకి (తన్నీరు) నాగేశ్వరరావుకు విశిష్ట కళా పురస్కార కార్యక్రమం వారణాసి రఘురామశర్మ ఆధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ విశిష్ట కళాపుస్కారం-2025ను సాహితీ కౌముది ఆధ్వర్యంలో అందజేశారు. సుదీర్ఘ కాలంగా రంగస్థల నటనకు అంకితభావంతో పని చేసి 3వేలకు పైగా నాటక ప్రదర్శనల్లో నటించి ప్రేక్షకుల మన్ననలు పొందిన నాగేశ్వరరావు సేవలను సభలో పలువురు ప్రశంసించారు. నాగేశ్వరరావు రంగస్థల సేవలు నేటి యువతకు స్ఫూర్తిదాయకం అని ఏపీసీపీడీసీఎల్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై అన్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావుకు పుట్టంరాజు బుల్లెయ్య - రావ౦లక్ష్మవ్మ చారిటబుల్ ట్రస్ట్ తరపున పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ దంపతులు కళా పురస్కారం అందించారు. నాటకరంగం నాప్రాణం అని, ఇది ఒక కళ మాత్రమే కాదు అని, ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసే గొప్ప సాధనం అని పురస్కార గ్రహీత నాగేశ్వరరావు అన్నారు. కొత్తతరం నాటక రంగం వైపు ఆకర్షితులవ్వాలని నా ఆకాంక్షని అన్నారు. విజయవాడ సీపీడీసీఎల్ పరిధిలో అద్దంకి డివిజన్‌ను ఉత్తమ డివిజన్‌గా తీర్చిదిద్ది విద్యుత్ శాఖ ద్వారా అవార్డు స్వీకరించిన ఈఈ నల్లూరి మస్తాన్‌రావుని సాహితీ కౌముది సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గాడేపల్లి దివాకర్‌దత్తు, డీవీఎం సత్యనారాణ, చప్పిడి వీరయ్య, పోలిరెడ్డి, మురళిసుధాకరరావు, కుమార్, ఆర్.రాజశేఖర్, సుబ్బారావు పాల్గొన్నారు.



విజయ చిహ్నం చూపుతున్న ఎమ్మెల్యే కొండయ్య

గ్రామాల్లో కలిసికట్టుగా పనిచేయండి

అభివృద్ధిని సాధించండి : ఎమ్మెల్యే కొండయ్య

చీరాలటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో వివాదాలు లేకుండా కలిసి కట్టుగా పనిచేసి అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో కావూరివారి పాలెం నుంచి 150 కుటుంబాలు పార్టీలో చేరారు. దీంతో ఎమ్మెల్యే కొండయ్య వారికి పార్టీ కండువాలు వేసి స్వాగతించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ వైఫల్యాలతో గ్రామాల్లో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నట్లు చెప్పారు. ఈక్రమంలో వాటిని గాడిలో పెట్టి ప్రజలకు అండగా నిలవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

మహనీయుల అడుగుల్లో నడవాలి

ఎమ్మెల్యే కొండయ్య

ఛత్రపతి శివాజీ లాంటి మహనీయుల అడుగుల్లో యువతరం నడవాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం చీరాల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఛత్రపతి శివాజీ సేవా సంఘ్ చీరాల ప్రతినిధులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్రపతి వేషధారణలతో అందరినీ అలరించారు. దీంతో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శివాజీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హిందూ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆధార్ మొబైల్ శిబిరాలు

చినగంజాం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు, 24 నుంచి 28వ తేదీ వరకు ఆధార్ మొబైల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి తెలిపారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయుల సహకారంతో గ్రామ పంచాయతీల్లోని 0-6 సంవత్సరాల లోపు చిన్నారుల ఆధార్ నమోదు కోసం ఆధార్ మొబైల్ క్యాంపులను రెండు విడతలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18వ తేదీన సంతరావూరు, చినగంజాం, 19న చింతగుంపల్లె, పల్లెపాలెం, 20న గొనసపూడి, కొత్తపాలెం, 21న కడవకుదురు, రాజుబంగారుపాలెం, 24న మోటుపల్లి, మున్నంవారిపాలెం, 25న చింతగుంపల్లె, పెదగంజాం, 27న గొనసపూడి, పెదగంజాం, 28వ తేదీన కడవకుదురు, చినగంజాం గ్రామాల్లో ఆధార్ నమోదు మొబైల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల్లో ఆధార్ క్యాంపులు జరుగుతున్నప్పుడు గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఆధార్ ఆపరేటర్లకు ఇద్దరు సచివాలయ సిబ్బందిని కేటాయించాలని ఆదేశించారు. గ్రామాల్లో క్యాంపులు జరిగే ముందు రోజు టాంటాం, ఇతర ప్రచార సాధనాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని ఎంపీడీవో తెలిపారు.

అమ్మ ఆశ్రమానికి టీవీ బహూకరణ

మార్టూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అమ్మ ఆశ్రమానికి అద్దంకికి చెందిన కందుకూరి గోవిందాచారి, రాజ్యలక్ష్మి దంపతులు టీవీ, మరో రూ.5వేల నగదును ఆదివారం ఆశ్రమం అధ్యక్షుడు గుంటుపల్లి చందుకు అందచేశారు.

కారు ఢీకొని ద్విచక్రవాహనదారుడికి గాయాలు

మార్టూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నుంచి చిలకలూరిపేటకు వెళుతున్న కారు ద్విచక్రవాహనదారుడ్ని ఢీకొన్న సంఘటన ఆదివారం మండల పరిధి బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళుతున్న కొణిదెన వెంకట్రావు అనే వ్యక్తి రోడ్డుపై పడిపోవడంతో గాయాలయ్యాయి. అతను అద్దంకి మండలం ధర్మవరం గ్రామానికి చెందినవారు. వ్యక్తిగత పనులు నిమిత్తం ద్విచక్రవాహనంపై మార్టూరు వచ్చి తిరిగి వెళ్తుండగా నెల్లూరు నుంచి వస్తున్న కారు టోల్ ప్లాజాను దాటి వస్తూ బైకును ఢీకొట్టింది. గాయపడిన వెంకట్రావును హైవే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు



అదుపుతప్పిన కారు

పంగులూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళ్తున్న కారు టైరు పేలి అదుపు తప్పడంతో జేపీ పాలెం ఫ్లైవోవర్‌పై తిరగబడిన ఘటన జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. అందిన సమాచారం మేరకు విశాఖకు చెందిన రామసుబ్రహ్మణ్యం కుటుంబంతో కారులో కడపకు బయలుదేరారు. మండలంలోని జాగర్లమూడివారిపాలెం వద్ద ఫ్లైవోవర్‌పై కారు టైరు పేలడంతో అదుపు తప్పి తిరగబడింది. ఆ సమయంలో కారులో రామసుబ్రహ్మణ్యం అతని భార్య వెంకటసుబ్బలక్ష్మి, కుమార్తె ఉన్నారు. కారులో ప్రయాణిస్తున్న రామసుబ్రహ్మణ్యంకు బలమైన గాయాలు కాగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సుబ్రహ్మణ్యంకు మెరుగైన చికిత్స కోసం ఒంగోలుకు తరలించారు. ఎస్ఐ వినోద్ బాబు సిబ్బందితో వెళ్లి తిరగబడ్డ కారును పక్కకు తీసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. రేణంగివరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి



షేక్ పాచు

అద్దంకి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి ప్రాంతంలో సుదీర్ఘ కాలం పాటు పనిచేసిన షేక్ పాచు (90) అనారోగ్యంతో మృతి చెందారు. కనిగిరి ప్రాంతానికి చెందిన పాచు నెళ్లూరు, కనిగిరి, అద్దంకి ప్రాంతాలలో 40 సంవత్సరాల పాటు పని చేశారు. అద్దంకి ప్రాంతంలో సుదీర్ఘ కాలం పాటు పనిచేసిన పాచు ఉద్యోగ విరమణ తరువాత కూడా ఇటీవల వరకు అద్దంకిలోనే ఉన్నారు. ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో ఒంగోలులో కుమారుడు వద్ద ఉంటూ శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత మృతి చెందారు. పాచుకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. పాచు మృతి పట్ల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అద్దంకి తాలూకా అధ్యక్షుడు షేక్ మస్తాన్, పలువురు ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

మెడికల్ క్యాంపులో 60 మందికి పరీక్షలు

చీరాలటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : చీరాల సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మెడికల్ క్యాంపులో సుమారు 60 మంది పాల్గొని వైద్య సేవలు పొందారు. సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హవీష్ ఆర్థో వైద్యులు డా. సజ్జా చెన్నకేశవరావు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగుల అవసరతల మేరకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు అత్తులూరి రామారావు, ప్రముఖులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల రైలు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

చీరాలటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు చోట్ల శనివారం జరిగిన రైలు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. ఈమేరకు రైల్వే పోలీసులు వివరాలు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అందిన వివరాల ప్రకారం.. చీరాల ఫైర్ గేటు సమీపంలో గుర్తు తెలియని సుమారు 50 సంవత్సరాల వ్యక్తి పట్టాలు దాటుతుండగా గూడూరు వైపు వెళ్లే గూడ్స్ రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే వేటపాలెం మండలం అరవ కాలనీ సమీపంలో సుమారు 40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తిని గూడ్స్ ఢీకొని మృతిచెందారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను ఏరియా వైద్యశాలకు తరలించారు.

పేదల ఇళ్ల మాటున వైసీపీ హయాంలో జరిగిన దోపిడీ అంతా ఇంతా కాదు. ఇళ్ల స్థలాల గుర్తింపు నుంచి గృహ నిర్మాణం వరకూ భారీ అక్రమాలు జరిగాయి. రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని దోచి పెట్టారు తప్ప పేదలకు గూడు మాత్రం నిర్మించలేకపోయారు. ఇప్పటికే భారీ ధరకు స్థలాల కొనుగోలు, లెవలింగ్ పేరుతో విచ్చలవిడి దోపిడీ, ఇళ్లు నిర్మించకుండానే బిల్లులు చెల్లించడం.. వంటి అక్రమాలపై విచారణలు పూర్తయ్యాయి. రూ.వందల కోట్ల దోపిడీ జరిగినట్లు తేలింది. ఈ కోవలోనే లేఅవుట్లలోనైనా ఇళ్ల స్థలాలను పేదలకు ఇచ్చారా!? లేదా!? అవి కూడా పెద్దలకు దోచి పెట్టారా!? తేల్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. గత ప్రభుత్వంలో పట్టాలు అందుకున్న వారి అర్హతపై క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రంగంలోకి దిగిన అధికారుల బృందం ప్రతీది క్షుణ్ణంగా అధ్యయనం చేస్తోంది.



పేదల లేఅవుట్లలో

పెద్దలు ఎవరు!?

- అనర్హుల ఏరివేతకు రంగం సిద్ధం
- విచారణకు కూటమి ప్రభుత్వం ఆదేశాలు
- రంగంలోకి దిగిన అధికారుల బృందం
- ప్రతి లేఅవుట్ జాబితా పరిశీలన

నెల్లూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పేదలందరికీ ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు నిర్మించి ఇస్తా మంటూ వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో 1,170 లేఅవుట్లు వేయగా ప్రస్తుత జిల్లాలో 852 లేఅవుట్లు వేశారు. ఇందుకు 2,832 ఎకరాల భూమిని ఉపయోగించారు. ఇక్కడ వెయ్యి ఎకరాలకు పైగా భూమిని ప్రైవేటు వ్యక్తుల నుంచి కొనుగోలు చేశారు. ఇలా వేసిన లేఅవు ట్లలో 1.35 లక్షల మందికి పట్టాలు ఇచ్చినట్లు అప్పట్లో అధికారులు ప్రకటించారు. వీటిని కన్వేయన్స్ డీడ్ రూపంలో అందించగా చాలా మంది తీసుకునేందుకు ముందుకు రాలేదు. అయితే కొందరికి పట్టాలు ఇచ్చినా వారి ప్లాట్లు ఎక్కడన్నది ఇప్పటికీ తెలియదు. ప్రతి లేఅవుట్‌లోనూ అర్హుల గుర్తింపులో భారీ అవకతవకలు జరిగినట్లు మొదటి నుంచీ ఆరోపణలు ఉన్నాయి. నిజమైన అర్హులను పక్కనపెట్టి వైసీపీ నేతలు, కార్యకర్త లను ఈ జాబితాలో చేర్చారు. కొన్ని విలువైన లేఅవుట్లలో చాలా ప్లాట్లను వైసీపీ నాయకులు తీసుకొని ఆ వెంటనే వాటిని అమ్మి సొమ్ము చేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా 98,781 మందికి ఈ లేఅవుట్లలో ఇళ్లు మంజూరు చేయగా ఇప్పటికీ 50 వేలకు పైగా ఇళ్లు పునాదుల దశ దాటకపోవడం గమనార్హం. జిల్లాలో ప్రైవేటు భూములు కొనుగోలు చేసేందుకు రూ.210 కోట్లు ఖర్చు చేశారు. ప్రభుత్వ భూముల విలువ మరో రూ.200 కోట్లు పైన ఉంటుంది. ఇక ఈ లేఅవుట్లను చదును చేసేందుకు రూ.260 కోట్లు ఖర్చు చేశారు లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించేందుకు ఇప్పటివరకూ సుమారు రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేశారు. ఈ లెక్కన చూస్తే జగనన్న కాలనీలకు సుమారు రూ.1700 కోట్ల వరకూ ప్రజా ధనాన్ని ఖర్చు చేసినట్లు అర్థమవుతోంది. మరి అంత ఖర్చు చేసి ఎంతమంది పేదలకు గూడు కల్పించారంటే చెప్పలేని పరిస్థితి.

ఈ నేపథ్యంలో పేదల కాలనీల్లో పట్టాలు పొందిన అనర్హులను ఏరివేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వంలో పట్టాలు పొందిన వ్యక్తులు నిజంగా అర్హులా.. కాదా..? అన్నది తేల్చాలని ఆదేశించింది. క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు బృందాలు ఏర్పడి విచారణ చేస్తున్నారు. ఈ విచారణకు సంబంధించి కొన్ని ప్రశ్నలను రూపొందించారు. సదరు పట్టాదారుడికి ఇది వరకే సొంతిల్లు ఉందా..? వారిలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారా..? వారికి నిబంధనలకు మించి ఆస్తులు ఉన్నాయా..? ఇదివరకు ఇతర హౌసింగ్ పథకాల్లో లబ్ధిపొంది ఉన్నారా..? వంటి ప్రశ్నలు ఇందులో ఉన్నాయి. ప్రస్తుతం విచారణ వేగంగా జరుగుతోంది. చాలా చోట్ల అక్రమాలు బయట పడుతున్నాయి. ఇది పూర్తయ్యాక అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయి..? ఎంత మంది అనర్హులకు పట్టాలు కట్టబెట్టారు..? అన్నది తేలుతుంది. ఈ వ్యవహారంపై జిల్లా రెవెన్యూ అధికారి జే ఉదయ భాస్కరరావును వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ లేఅవుట్లలో లబ్ధిదారుల అర్హతపై విచారణ జరుగుతున్నట్లు చెప్పారు. విచారణ పూర్తయ్యాక ప్రభుత్వానికి నివేదిక పంపుతామని పేర్కొన్నారు.

వెలుగులోకి వస్తున్న అక్రమాలు

ఉపాధి.. ఆర్థికాభివృద్ధి!

- ఆ దిశగా 'మెప్మా' అడుగులు
- ప్రభుత్వ పథకాలు అందించేలా కృషి

- వివరాలు 7లో



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, కోశాధికారి దుర్గా దొరబాబు, పక్కన కార్యవర్గ సభ్యులు

పంచాయతీ కార్యదర్శుల గ్రేడ్లు కుదించాలి

నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న పంచాయతీ కార్యదర్శుల గ్రేడ్లను కుదించాలని జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం తీర్మానించింది. ఆ సంఘం సమావేశంలో నెల్లూరు రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం జరిగింది. నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం కార్యదర్శుల ను 6 గ్రేడ్లుగా విభజించారని, దానిని మూడుకు కుదించాలని డిమాండ్ చేశారు. అలాగే, పంచాయతీ కార్యదర్శి పోస్టు పేరు మార్చాలని, కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యల ను పరిష్కరించాలని కోరారు. కాగా, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ముషీధర్, ఉపాధ్యక్షురాలిగా పద్మజను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీధర్, కోశాధికారి దుర్గా దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్

- చికెన్ షాపులు వెలవెల

కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధిసోకి మృత్యువాత పడుతుండటంతో చికెన్ కొనుగోలుకు ప్రజలు వెనుకడుగు వేస్తున్నారు. ఆదివారం సెలవురోజున చికెన్ షాపులన్నీ వెలవెలబోయాయి. నెల్లూరు, ఉదయగిరి, కావలి, కందుకూరు, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో షాపులన్నీ బోసిపోయాయి. ఉదయగిరిలోని ప్రధాన చికెన్ దుకాణాల్లో రోజుకు 500 కిలోల మాంసం విక్రయిస్తుండగా, కనీసం 100 కిలోలు కూడా అమ్ముడు పోలేదని వ్యాపారులు వాపోయారు. చికెన్‌కు దూరమైన ప్రజలు చేపలు, మటన్ కొనుగోళ్లకు ఎగబడ్డారు. అరకిలో మటన్ తీసుకునేందుకు గంటల సేపు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

-ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

మామిడీలా!

- ఓ వైపు మంచు.. మరోవైపు తెగుళ్ల బెడద
- మాడిపోతున్న పూత.. రాలిపోతున్న పిందెలు
- దిగుబడిపై తీవ్ర ప్రభావం
- ఆందోళనలో సాగుదారులు

మామాడి సాగుదారు ఈసారి కూడా డీలా పడుతున్నాడు. గత వైసీపీ ప్రభుత్వ సహాయ నిరాకరణ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న రైతుకు ఆదిలోనే మంచు తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఓ వైపు పొగ మంచు, మరోవైపు తెగుళు ప్రభావంతో మామిడి చెట్లలోని పూత మాడిపోతోంది. ఇది దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని కర్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- సంగం/ఉదయగిరి, ఆంధ్రజ్యోతి

జిల్లాలోని ఉదయగిరి, కందుకూరు, కావలి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో విస్తారంగా మామిడి తోటలు ఉన్నాయి. సాధారణంగా నవంబరు నుంచి జనవరి వరకు మామిడి చెట్లలో పూత వస్తుంది. అయితే, ఈ ఏడాది మాత్రం ఆలస్యంగా పూత వస్తోంది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి నెల సగం పూర్తయినా మంచు కురుస్తూనే ఉంది. ఇటీవల వారం రోజుల నుంచి పొగ, గూడ మంచు మరీ ఎక్కువయ్యింది. ఈ మంచు కారణంగా పూత మాడిపోతోంది. దీనికితోడు తేనె మంచు పురుగు సోకడంతో ఉన్న పూత కూడా దెబ్బతిన్నది. మంచు ఇలాగే కొనసాగితే మామిడిపై ఆశలు వదులు కోవల్సిందేనని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాపు నిలబడితే చాలు..

ఈ సంవత్సరం ఆలస్యంగానైనా పూత బాగా వస్తుందని మామిడి రైతులు ఆశ పడ్డారు. కానీ మంచు దెబ్బకు పూత మాడిపోగా, పిందె దశలో ఉన్న కాయలు కూడా రాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. కాపు నిలబడితే చాలని భావిస్తున్నారు. కానీ వాతావరణ పరిస్థితుల కారణంగా దిగుబడి ఎంతవరకు వస్తుందనే అంచనా వేయలేకపోతున్నారు. మంచు దెబ్బకు కాయ సైజు తగ్గడంతో మార్కెట్‌లో ధర పలకదని, ముందస్తు కొనుగోలు చేసే వ్యాపారులు కూడా వెనకడుగు వేస్తున్నారని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి 4 టన్నుల దిగుబడి వచ్చి టన్ను రూ.20 వేలకు పైగా ధర పలికితే పెట్టుబడి బ్యాంకుల రుణాల వడ్డీలకే సరిపోతుందంటున్నారు. మంచు దెబ్బతో తెగుళ్ల నివారణకు పిచికారీ మందుల కోసం ఎకరానికి రూ.60 వేల వరకు ఖర్చు అవుతోంది.

పెరుగుతున్న సాగు ఖర్చులు

ఒక ఎకరా విస్తీర్ణంలో మామిడి మొక్కలు తెచ్చేందుకు, దుక్కులు, వాటిని వేసే కూలీలు, ఇతర పనులకు రూ.50వేల వరకు పెట్టుబడి అవుతోంది. వీటితో పాటు రసాయనిక ఎరువులు, పురుగు మందులు, కూలీలు, రవాణా తదితర ఖర్చులు అదనంగా ఉంటాయి. పూత దశలో నీరు పెట్టడం, పూత నిలిచేందుకు పలుమార్లు మందులు పిచికారీ చేయడం, యాజమాన్య పద్ధతులు పాటించక పోవడంతో పంట చేతికి రావడంలేదు. వచ్చినా అరకొరగా దిగుబడి వస్తుండటంతో పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితి. ఒకవేళ దిగుబడులు వచ్చినా ఆశించిన ధరల లేకపోతే నష్టపోతారు. చేసేదిలేక దళారులు, వ్యాపారులు చెప్పిన ధరలకే మామిడి కాయలు అమ్ముకోవాల్సి దుస్థితి వస్తోంది. ఇప్పటికైనా ఉద్యానశాఖ అధికారులు స్పందించి మామిడి రైతులకు పంట సాగుతోపాటు తెగుళ్ల నివారణ, అధిక దిగుబడికి సూచనలు, సలహాలు అందజేయాలి. అలాగే మార్కెట్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సాగుదారులు కోరుతున్నారు.



సంగం : చెట్లపైనే మాడిపోతున్న పూత



పూలే విగ్రహాలను ఆవిష్కరించిన హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, పక్కన రాష్ట్ర మంత్రి నారాయణ, అబ్దుల్ అజీజ్ తదితరులు

జ్యోతిరావు పూలే అందరికీ ఆదర్శప్రాయులు

- హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ
- పూలే దంపతుల విగ్రహాలు ఆవిష్కరణ

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : జ్యోతిరావు పూలే అందరికీ ఆదర్శప్రాయులని, ప్రతి ఒక్కరూ ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని పూలే అడుగుజాడల్లో నడవాలని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. నెల్లూరులోని పప్పులవీధిలో ఉన్న ఎడ్లపల్లి వెంకటేశ్వర్లు నగరపాలక ఉన్నత పాఠశాలలో బండారు ఈశ్వరమ్మ పొదుపు గ్రూపు సౌజన్యంతో జాతీయ బీసీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూలే దంపతుల విగ్రహాలను దత్తాత్రేయ ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో అసమానతలను రూపుమాపేందుకు పూలే ఎంతో కృషి చేయడంతోపాటు విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని వెనుకబడిన వర్గాల్లో విద్యా ప్రమాణాలు పెంపునకు కృషి చేస్తారని కొనియాడారు. పూలే సతీమణి సావిత్రాబాయికి విద్య నేర్పించడంతో పాటు ఒక సామాజిక సంఘసంస్కర్తగా తీర్చిదిద్దారని అన్నారు. ఆమెద్వారా మహిళల్లో విద్యపట్ల చైతన్యం కలిగించడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ లక్ష్యంతో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని, వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ పూలే దంపతులు సమాజానికి అందించిన సేవలను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆర్డీఓ అనూష, అధికారులు, నేతలు పాల్గొన్నారు.

కందలపాడు మైనింగ్ అనుమతులు

రద్దు చేయండి

- మంత్రి లోకేష్‌కు గ్రామస్థుల విజ్ఞప్తి
- మనుబోలు, వెంకటాచలం వద్ద యువనేతకు ఘన స్వాగతం
- తరలివచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు
- పలు సమస్యలపై అర్జీల స్వీకరణ




మనుబోలు క్రాస్ రోడ్డు వద్ద కార్యకర్తలతో కరచాలనం చేస్తున్న లోకేష్

వెంకటాచలం/మనుబోలు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం మండలం కందలపాడు పరిసరాల్లో మైనింగ్ కోసం ఇచ్చిన అనుమతులను రద్దు చేసి సాగులో ఉన్న తమ భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఆ గ్రామస్థులు రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదివారం ఉదయం విజయవాడ నుంచి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న లోకేష్‌కు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం రోడ్డుమార్గాన వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్‌కు ప్రత్యేక కాన్వాయ్‌లో బయలుదేరారు. ఈ క్రమంలో మనుబోలు, వెంకటాచలం జాతీయ రహదారిపై టీడీపీ నేతలు, కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద నాయకులు, అభిమానులకు లోకేష్ తన కారు బయట నిలబడి అభివాదం చేశారు. ఈ సందర్భంగా కందలపాడు మైనింగ్ అనుమతులపై గ్రామస్థులు లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే మరికొందరు అర్జీలు ఇవ్వగా వాటిని స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

- అంతకముందు లోకేష్‌ను చూసేందుకు మనుబోలు క్రాస్ రోడ్డు వద్దకు కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్ ఇతర నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. లోకేష్ కాన్వాయ్ రాగానే కాబోయే సీఎం అంటూ నినాదాలు చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి తదితరులు లోకేష్‌కు బొకే ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, సాని వెంకటరమణయ్య, దండు చంద్రశేఖర్‌రెడ్డి, రాయపాటి కిరణ్ కుమార్, ముంగర విజయ భాస్కర్‌రెడ్డి, చెల్లగిరి ప్రసాద్, శివుడు రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





పోలీసు మెడకు

'అనంతార్థ' స్కాం!

- సూత్ర, పాత్రధారులూ కానిస్టేబుళ్లే!
- సమగ్ర విచారణకు జంకుతున్న వైనం
- ఉన్నతాధికారుల తీరుపై అసహనం
- కేసు నమోదైనా సుభాన్ ఖాతాలోకి నగదు?

కావలి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ముసునూరులో అనంతార్థ మనీస్కాం వ్యవహారం పోలీసుల మెడకు చుట్టుకుంటోంది. సూత్ర, పాత్రధారులు ఆ శాఖ సిబ్బందే ఉండటంతో ఉన్నతాధికారులకు తల నొప్పిగా మారిం ది. పూర్తిస్థాయిలో విచారిస్తే తమ పరు వు ఎక్కడ పోతుందో నని భావిస్తూ నగదు రికవరీపైనే ఫోకస్ పెట్టారన్న విమర్శలు ఉన్నాయి. గుంటూరుకు చెందిన మహబూబ్ సుభాన్ 2021 నుంచి కావలిలో ఈ స్కాం నిర్వహిస్తుంటే దాన్ని కట్టడి చేయాల్సిన పోలీసులు ఆయనకు రక్షణగా నిలవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. పోలీసులతో పాటు ఇంటెలిజెన్స్, స్పెషల్‌బ్రాంచ్, విజిలెన్స్ నిఘా విభాగా లున్నా సాక్షాత్తు ఎమ్మెల్యే వెంకటక్రిష్ణా రెడ్డి ఫిర్యాదు చేసే వరకు పట్టించుకోక పోవటంతో ప్రజలకు పోలీసులపై నమ్మకం సన్నగిల్లుతోంది. ఈ స్కాంలో కొందరు పోలీస్‌లు లబ్ధి పొందగా మరికొందరు తీవ్రంగా నష్టపోయారు.

ఆఫర్లు, కమీషన్లు

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో 'అనంతార్థ' నిర్వాహకులు కొందరు యువకులకు శిక్షణ ఇచ్చి చివరకు వారినే ఏజెంట్లుగా నియమించుకున్నారు. డబ్బులు కట్టే వారి కి రకరకాల ఆఫర్లు ఇచ్చారు. పొచి పని చేసు కునే వారి మొదలు ఉద్యోగుల వరకు భారీగా కలెక్షన్లు వసూలు చేసినట్లు విచారణలో తెలుస్తోంది. 2021 నుంచి డబ్బులు కట్టించే వారికి కూడా కమీషన్లు వస్తుండటంతో ఎక్కడా నిజాలు వెలుగులోకి రాలేదు.

పోలీసులకు తలనొప్పిగా..

స్కాంలో పాత్ర, సూత్రధారులు, ఏజెంట్లు పోలీసులే ఉండటంతో దీనిపై సమగ్ర విచారణ జరిపేందుకు పోలీసు ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారుతోంది. లోతైన విచారణ జరిపితే తమ శాఖ ఉద్యోగులు ఇబ్బందులు పడతారేనని కాబట్టి బాధ్యులపై చర్యలు పక్కన పెట్టి వీలైనంత వరకు నగదు రికవరీ చేసి బాధితులకు న్యాయం చేయాలనే కోణంలో విచారిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, నిందితుడు మహబూబ్ సుభాన్‌పై కేసు నమోదైన తర్వాత కూడా డిపాజిట్లు వస్తున్నాయంటే ఏజెంట్లు భయంలేకుండా ఎంత బరి తెగించి ఉన్నారో అర్థం అవుతోంది.

తెలంగాణా బాధితులు కావలికి..

సుభాన్ తెలంగాణాలో కూడా సుమారు రూ.200 కోట్ల వరకు స్కాం చేసి తప్పించుకుని తిరుగుతున్నారని ఆ రాష్ట్రానికి చెందిన పలువురు బాధితులు వాపోయారు. మక్తల్ నియోజకవర్గానికి చెందిన బాధితులు అక్కడ ఎమ్మెల్యేతో కావలి ఎమ్మెల్యేకు ఫోన్‌లో మాట్లాడించి కావలికి వచ్చారు. ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిని కలిసి అక్కడ ఆయన చేసిన మోసాలను వివరిం చారు. అనంతరం సుభాన్ కార్యాలయం వద్దకు వెళ్లి కొంతసేపు ఉండి వెళ్లిపోయారు.

నగదు జమవుతూనే ఉంది!

'అనంతార్థ' నిర్వాహకుడు సుభాన్‌పై పోలీసు కేసు నమోదయినా ఆయన బ్యాంకు ఖాతాలో మాత్రం ఇప్పటికీ నగదు జమ అవుతూనే ఉంది. ఓ కానిస్టేబుల్ తన ప్లాటు అమ్మగా వచ్చిన నగదును ఈ స్కాంలోని ఓ సూత్రధారి అయిన మరో కానిస్టేబుల్ ద్వారా ఈ నెలలో ఏజెంట్ ఖాతాలో జమ చేయించినట్లు తెలిసింది. అయితే ఆ డబ్బులు సుభాన్ ఖాతాలో జమకాలేదని సమాచారం. అప్పటికే సుభాన్ ఆర్థిక లావాదేవీలన్నీ నిలిచిపోవటంతో ఆ డబ్బులు ఎవరి ఖాతాలో వేశారో బయటపెట్టడం లేదు.

- అలాగే ఏజంట్‌గా ఉన్న ఒక మెకానిక్ కూడా ఇటీవల కొంతడబ్బును ఒక వ్యక్తి ద్వారా సుభాన్ అకౌంట్‌కు వేశారు. ప్రజలు ఇలా డబ్బులు కడుతుంటే తానేమి చేయాలని సుభాన్ పోలీసులకు చెప్పిన ట్లు తెలిసింది. ముసునూరు సబ్‌స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్ ఆ ప్రాంతంలోని గిరిజనులతో చాలా డబ్బులు కట్టించినట్లు తెలుస్తోంది.

కమీషన్లు కూడా స్కీంలోకే..

లబ్ధి పొందిన వారికన్నా నష్టపోయిన వారే అధికంగా ఉన్నారు. నాలుగేళ్లుగా కట్టిన వారికి అధిక మొత్తంలో రీ పేమెంట్ పొందారు. పెట్టుబడిదారులు, కమీషన్ ఏజెంట్లు అందరూ కాగితాల రూపంలో సంపాదన లెక్కలు వేసుకోవటం తప్ప వారి చేతికి పెద్దగా వచ్చింది లేదు.

రోడ్డు ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే కాకర్ల ఆర్థిక సాయం

కొండాపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో గాయపడిన గరిమెనపెంట బాధితులకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ట్రస్టు తరపున రూ.50వేలు అందజేశారు. ఆదివారం నగదును టీడీపీ నాయకులు వారి స్వగృహాలకు వెళ్లి అందజేశారు. ఆర్థికసాయం అందజేసిన ఎమ్మెల్యేకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్ణయ్య, మధు, శ్రీనివాసులు, రమణయ్య, తిరుపాలు పాల్గొన్నారు.


యానకి లక్ష్మీదేవికి నగదు అందచేస్తున్న టీడీపీ నాయకులు

పోలీసు శిక్షణలో పేట ఎస్ఐ ప్రతిభ

ఏఎస్‌పేట, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తిరుపతి జిల్లా కళ్యాణి డ్యామ్ వద్ద జరిగిన పోలీసు శిక్షణలో ఏఎస్ పేట ఎస్ఐ సైదులు ప్రతిభ చూపి ప్రథమస్థానంలో నిలిచారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా, రాయలసీమ ప్రాంతాలకు చెందిన పలువురు పోలీసు అధికారులకు మాదక ద్రవ్యాల నిరోధకంపై ఇక్కడ శిక్షణ నిర్వహించారు. శిక్షణ అనంతరం జరిగిన రాతపరీక్షలో ఆయన ప్రతిభ చూపి ప్రథమ బహుమతి పొందారు.


సైదులు

పడకేసిన పారిశుధ్యం

- రోడ్లపైనే మురుగునీరు నిల్వ
- దోమలకు ఆవాసాలుగా గుంతలు
- ఫాగింగ్ చేయని గ్రామ కార్యదర్శులు

లింగసముద్రం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో పారిశుధ్యం కొరవడింది. పంచాయతీల్లో నిధులున్నా అధికారులు ఫాగింగ్ చేయించడం, బ్లీచింగ్ చల్లడం వంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ సమస్యతో రెండు నెలలుగా ప్రజలు జ్వరాలు, జలుబు, దగ్గు, ఇతర చిన్న వ్యాధులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి మందులు అందజేసినా మరలా తిరగబెడుతున్నాయి. పంచాయతీ కార్యదర్శులు ఆలస్యంగా బ్లీచింగ్ చల్లించి చేతులు దులుపుకుంటున్నారు. దీనికితోడు జంగిల్ తొలగించే చర్యలు తీసుకోవడం లేదు. మురుగు కాలువల్లో లార్వా చనిపోయేందుకు ఎబేట్ చల్లక పోవడం, ఫాగింగ్ చేయించక పోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి.

మరమ్మతుకు నోచుకోని 14ఫాగింగ్ యంత్రాలు

వైసీపీ ప్రభుత్వంలో మండలంలోని 13గ్రామ సచివాలయాలకు 13, ఎంపీడీఓ కార్యాలయానికి ఒక ఫాగింగ్ యంత్రాలను అందజేశారు. నేడు మొరాయించడతో వాటికి మరమ్మతులు చేపట్టడం లేదు.


మూలనపడ్డ ఫాగింగ్ యంత్రం

సీసీలు ఉన్నా సైడ్ కాలువలు లేవు..

గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించినా సైడు కాలువలు లేక పోవడంతో రోడ్లపైనే నీరు మురుగునీరు నిలుస్తోంది. వీఆర్ కోట, అన్నెబోయినపల్లి, పెదపవని, లింగసముద్రం, మొగిలిచెర్ల తదితర గ్రామాల్లో రోడ్లపైనే నీరు నిలుస్తోంది. ప్రతి గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ శ్రీనివాసులు చెబుతున్నా, ఒకరిద్దరు తప్ప మిగిలిన వారు పనులు చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


వీఆర్.కోట అంతర్గత రోడ్డుపై నిలిచిన మురుగు

బాధితులకు ఆర్థిక సాయం

ఉదయగిరి, ఫిబ్రవరి 16: ప్రమాదాలకు గురై మంచానికే పరిమితమైన, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి గంగిరెడ్డిపల్లిలోని నివాసంలో ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన దేవండ్ల రమణయ్యకు రూ.10 వేలు, గుండెజబ్బుతో బాధపడుతున్న చిన్నారికి, దివ్యాంగుడి కుటుంబఅవసరాలకు చెరో రూ.5వేలు అందచేశారు. కార్యక్రమంలో నాయకులు, ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.


నగదు అందజేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి

న్యూస్ బాక్స్

పాఠశాలను విలీనం చేయొద్దు

లింగసముద్రం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పెదపవని ముస్లిం కాలనీలోని ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను భోగరావు జడ్పీ హైస్కూల్‌లో విలీనం చేసే నిర్ణయాన్ని విరమించుకోవాలని పాఠశాల అభివృద్ధి కమిటీ సెక్రటరీ, గ్రామ ముస్లిం అభివృద్ధి కమిటీ కార్యదర్శి ఎస్ఎం.బాషాతో పాటు మరికొందరు గ్రామస్థులు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 1947లో స్థాపించిన ఈ పాఠశాలపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ఎలా విలీనం చేస్తారని పేర్కొన్నారు. పాఠశాలను యధావిధిగా కొనసాగించని పక్షంలో న్యాయ పోరాటం చేస్తామన్నారు.

దాడి చేశారని ఫిర్యాదు

కావలి రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు అర్ధరాత్రి కాపుకాచి కర్రలతో దాడి చేశారని వెంగయ్యగారిపాలెం వైసీపీ నాయకుడు మాతిన నాగరాజు ఆదివారం 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిన్నాయి. పట్టణంలోని సూర్య బార్ క్యాషియర్ నాగరాజు శనివారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా పాత గొడవలను దృష్టిలో పెట్టుకుని అదే గ్రామానికి చెందిన జంపాని ప్రసాద్, మరికొందరు కర్రలతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

గంగమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ

దుత్తలూరు(ఉదయగిరి), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు చెరువుకట్ట సమీపంలో ఆదివారం గంగమ్మ ఆలయ నిర్మాణానికి గ్రామస్థులు భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న వేదపండితులు, గ్రామస్థులు

కందుకూరు అభివృద్ధిపై సీఎంకు చిత్తశుద్ధి ఉంది

- రూ.50కోట్ల నిధుల మంజూరుపై హర్షం
- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు రూ.50కోట్లు నిధులు మంజూరు చేయడంపై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేస్తూ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కోసం పట్టణాన్ని ఎంపిక చేసుకోవడం మనప్రాంత అభివృద్ధిపై ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. అదేవిధంగా దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని గర్భకండ్రిక భూముల సమస్య పరిష్కారానికి జీఓ విడుదల చేసి శాశ్వత పరిష్కారం చూపిన సీఎం చంద్రబాబునాయుడుకు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలో డంపింగ్ సమస్య లేకుండా ఏరోజుకారోజు చెత్తను రీసైక్లిలింగ్ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టినందున ప్రజలు అందుకు సహకరించాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, నార్నె రోశయ్య, మాదాల లక్ష్మీనరసింహ్మం, చిలక పాటి మధు, చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాదు, ముచ్చు శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మహిళకు సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

నియోజకవర్గంలో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 20మంది పేదలకు వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి వచ్చిన రూ.19.01 లక్షల చెక్కులను ఎమ్మెల్యే బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

బిట్రగుంట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు పాతబిట్రగుంట ద్వారకానగర్‌లోని షిర్డిశేషసాయి మందిరంలో భక్తుల అవసరార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తునట్లు మందర వ్యవస్థాపకులు కుట్టుబోయిన బ్రహ్మానందం తెలిపారు. ఆదివారం బాబాకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. సాయి నామ సంకీర్తన, తీర ప్రాంత భజన బృందాలు పూజలు చేపటారు. దర్శనార్థం భక్తులకు బ్రహ్మానందం, వసుంధర దంపతులు అన్నసంతర్పణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 9నుంచి 15 వరకు జరుగనున్నాయని తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు దాతల సహకారంతో మందిరంలో నాలుగురోజుల పాటు అన్నసంతర్పణ చేసేందుకు కమిటీ సభ్యులు తీర్మాణించినట్లు తెలిపారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- రామకృష్ణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఉదయగిరి



ఉదయగిరి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి):రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని మెట్టప్రాంతమైన ఉదయగిరిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణరావు పేర్కొన్నారు. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, తగిన ప్రణాళికలతో నీటి అవసరాలను తీర్చుతామన్నారు.

? తాగునీటి సమస్యను ఎలా అధిగమిస్తారు.

! గతేడాది వర్షాలు బాగా కురవడంతో గ్రౌండ్ వాటర్ బాగుంది. నీటి సమస్య తలెత్తిన గ్రామాల పరిస్థితిని ముందుగానే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి తాగునీటి సమస్య తీరుస్తాం.

? చేతిపంపులకు మరమ్మతులు చేయిస్తున్నారా...

! సబ్‌డివిజన్ పరిధిలోని సీతారామపురం, దుత్తలూరు, ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో చేతిపంపుల సామగ్రి పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంది. మరమ్మతులకు గురైన చేతిపంపులను ఎప్పటికప్పుడు బాగు చేయిస్తున్నాం.

? ఇంటింటికీ కుళాయి మాటేమిటీ..

! గత ప్రభుత్వంలో మంజూరైన జలజీవన్ పనులు రద్దయ్యాయి. కూటమి ప్రభుత్వం ఈ పథకానికి సంబంధించి ప్రస్తుతం సర్వే నిర్వహిస్తున్నది. సోమశిల నుంచి ప్రత్యేక పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేసి, ఇంటింటికి కుళాయితో నీరు సరఫరా చేస్తాం.

ధ్యానంతో దీర్ఘకాలిక వ్యాధుల నయం


వింజమూరులో పిరమిడ్ ధ్యానుల ర్యాలీ

వింజమూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ధ్యానం చేయడం ద్వారా వివిధ రకాల దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసుకోవచ్చని చిత్తూరు జిల్లా బంగారుపాలెంకి చెందిన పిరమిడ్ మాస్టర్ రోహిణీలక్ష్మి వివరించారు. వింజమూరులోని శ్రీవేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం జరిగిన ఆత్మజ్ఞానం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. భూమ్మీద అతిపెద్ద పాపం మాంసం తినడమేనని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో మహాకరుణ శాకాహార ర్యాలీ నిర్వహించారు. మార్చి 9న నంద్యాల జిల్లా డోన్‌లో జరిగే మహాకరుణ శాకాహార ర్యాలీకి హాజరు కావాలని కోరుతూ కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో శ్రీజ, హేమలత, లక్ష్మి, రవిచంద్ర, జానకిరామిరెడ్డి, హజరత్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నాగారపమ్మకు పొంగళ్లు

సంగం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల లో ఉన్న నాగారపమ్మ ఆలయంలో భక్తులు ఆదివారం భక్తి శ్రద్ధలతో పొంగళ్లు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మ వారి మూలవిరాట్‌కు క్షీర,పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, పూలతో అలంకరించారు. భక్తులు పెన్నాఘాట్‌లో స్నానం ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.


నాగారపమ్మను దర్శించుకుంటున్న భక్తులు

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు గుర్తించుకోవాలి

- ఆంధ్ర ముస్లిం యోధులు పుస్తకావిష్కరణ
- పాల్గొన్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి టౌన్, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని ఎమ్మెల్యే కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం రెడ్‌క్రాస్ భవన సమావేశ మందిరంలో రచయిత సయ్యద్ నసీర్‌అహ్మద్ రచించిన భారత స్వాతంత్ర్య ఆంధ్ర ముస్లిం యోధులు అనే పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మాజీ కౌన్సిలర్ మస్తాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భావితరాలకు త్యాగమూర్తుల గురించి తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం రచయిత నసీర్‌అహ్మద్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు.

సినిమాల ప్రభావంతో వక్రీకరణ: రచయిత నసీర్

సినిమాల్లో వాస్తవ చరిత్ర వక్రీకరించబడుతుందని దాన్నే నేటితరం నిజం అని నమ్ముతున్నారని పుస్తక రచయిత నసీర్ వాపోయారు. వాస్తవ చరిత్ర తెలుసుకోవాలంటే అప్పటి ప్రముఖ చరిత్రకారులు, రచయితల పుస్తకాలను చదవాలని కోరారు. స్వాతంత్రోద్యమంలో ఆంధ్ర ముస్లింలు అనేకమంది ప్రముఖపాత్ర పోషించి అసువులు బాశారని వారిని స్మరించుకోకపోవడం బాధాకరం అన్నారు. కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సఫ్దార్ కిర్మాణి, రాజ్‌కుమార్ చౌదరి, తిరివీధి ప్రసాద్, డాక్టర్ బెజవాడ రవికుమార్, జాఫర్‌ఖాన్, శారద పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, రచయిత నసీర్‌అహమద్ , తదిరులు

- టీడీపీ సభ్యులకు అండగా ఉంటాం

కావలి రూరల్: టీడీపీ కుటుంబసభ్యులకు ఎళ్లవేళలా అండగా ఉంటామని ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం అన్నగారిపాలెం పంచాయతీ కుమ్మరిపాలెం తాతా శివ, పొన్నగంటి వెంకయ్య, శింగిరిగిరిపాలెం కైతుపల్లి నారాయణ, కొనదిన్నె జంపాని పద్మ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, ఆవుల రామక్రిష్ణ, ఉప్పాల వెంకట్రావు పాల్గొన్నారు.

కిక్కిరిసిన చేపల మార్కెట్

బిట్రగుంట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ ప్రచారం కలకలం రేపతుండటంతో ప్రజలు ఆదివారం సెలవుదినం రోజున మటన్, చేపల కొనుగోలు చేసేందుకు ఆసక్తిచూపారు. స్థానికులు ఎక్కువగా మాంసం, చేపలు కొనుగోలు చేసేందుకు రావడంతో మార్కెట్ కిక్కిరిసిపోయింది. కొనుగోలుదారులు రాకపోవడంతో చికెన్ షాపులు బోసిపోయాయి.


చేపల మార్కెట్‌లో జన సందోహం

నిలిచిన పనులు

కావలి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాల కమిటీలకు నిధులు మంజూరు అయినా ఇసుక, సిమెంట్ సరఫరా చేయక పోవడంతో స్థానిక వెంగళరావునగర్ శ్రీపొట్టిశ్రీరాములు ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు నిలిచిపోయినట్లు పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ కల్లయ్య, వైస్ చైర్మన్ సుభాషినిలు తెలిపారు. ఈ విషయంపై పాఠశాల కమిటీ సభ్యులు సమావేశమై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాడు-నేడు కింద రూ.90లక్షలు మంజూరవగా గదుల నిర్మాణ పనులు పూర్తి చేశామని, గ్రానైట్ వేసేందుకు ఇసుక, సిమ్మెంట్ లేదన్నారు.

మనీ స్కాం బాధితులకు న్యాయం చేయాలి

- వామపక్ష నేతలు వెంకటేశ్వర్లు, పెంచలయ్య, లక్ష్మీరెడ్డి

కావలి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని అనం తార్థ అసోసియేషన్ మనీ స్కాం నిర్వాహకులపై చర్యలు తీసుకొని.. నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని వామపక్షాల నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, పసుపులేటి పెంచలయ్య, లక్ష్మీరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం వామపక్షాల నాయకులు సమావేశమై ఈ విషయంపై చర్చించారు. అనేకమంది బాధితులను విచారించగా వారు తమ బాధలు తమతో చెప్పుకున్నారని వారికి న్యాయం జరిగే అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మనీ స్కాంలో ఏజంట్లుగా ఉండి దానికి అండగా నిలిచిన ప్రభుత్వ అధికారులు, పోలీస్ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ స్కాంపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. ఈ స్కాంలో సంబంధం ఉన్న చిన్నస్థాయి ఉద్యోగులపై చర్యలు తీసుకుని పైస్థాయి అధికారులను రక్షించే ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. అనేక రాష్ట్రాలలో ఈ తరహా నేరాలకు పాల్పడిన వ్యక్తికి కావలిలో పోలీస్‌లు అండగా ఉండటం అత్యంత దారుణం అన్నారు. విచారణ పేరుతో జాప్యం చేయటం.. పోలీస్‌లు పాత్రదారులుగా ఉండటం చూస్తే బాధితులకు న్యాయం జరుగుతుందనే అభిప్రాయం ప్రజలలో సన్నగిల్లుతోందన్నారు. సమావేశంలో నాయకులు దమ్ము దర్గాబాబు, కే.నాగరాజు, సీపీఎం, సీపీఐఎంఎల్ నాయకులు కరువది భాస్కర్, మల్లె అంకయ్య, చేవూరు కొండయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

'కామధేను' అభివృద్ధికి కృషి చేస్తా : బొల్లినేని

కొండాపురం, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): చింతలదీవి పశుసంవర్ధక క్షేత్రంలోని జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తానని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లినేని వెంకట రామారావు తెలిపారు. ఉప్పలూరు మాజీ సర్పంచ్ ఓరుగంటి మస్తానయ్య కుమారుడు ధనుంజయ్ గంధపునలుగు వేడుకలో ఆదివారం ఆయన పాల్గొని ఆశీర్వదించి మాట్లాడారు. అప్పటి ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు సహకారంతో దేశంలోనే రెండో పెద్దదైన ఈ కామధేను పునరుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం ఈ కేంద్రం అభివృద్ధికి నిధులు మంజూరు చేయలేదన్నారు. కార్యక్రమంలో మామిళ్లపల్లియ ఓం కారం, చెరుకూరు వెంకటాద్రి, మాలకొండారెడ్డి, వల్లూరు వెంకటేశ్వర్లు, పదర్ల తిమోతీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లినేని

సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ల కొరత

- సచివాలయాలు 13.. ముగ్గురే ఇంజనీరింగ్ అసిస్టెంట్లు
- ఒకరికి 5.. ఇద్దరికి 4 చొప్పున సచివాలయాల బాధ్యతలు
- వీరికి నాలుగుశాఖల పనులతోపాటు అదనపు పనులు

లింగసముద్రం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 13గ్రామ సచివాలయాల్లో 10సచివాలయాలకు రెగ్యులర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 13సచివాలయాలకు కేవలం ముగ్గురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఎర్రారెడ్డి పాలెం సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంటు కె.స్రవంతికి అదనంగా తిమ్మారెడ్డిపాలెం, మాలకొండ రాయునిపాలెం, లింగసముద్రం-1, 2 సచివాలయాలు, పెంట్రాల సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంటు ఎం.వెంకటేష్‌కు మొగిలిచెర్ల, వీఆర్‌కోట, అన్నెబోయినపల్లి సచివాలయాలు, చినపవని ఇంజనీరింగ్ అసిస్టెంటు నందినికి ముత్యాల పాడు, పెదపవని-1,2 సచివాలయాలకు ఇన్‌చార్జిలుగా బాధ్యతలు అప్పగించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, నాడు-నేడు పనులతో పాటు అదనంగా సాంకేతికం కాని పనులు కూడా వీరు చేయాల్సి వస్తుంది. వీరికి పని భారంతో పాటు, ప్రజలకు కూడా పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. ఇంజనీరింగ్ అసిస్టెంట్ల కొరతను తీర్చేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



లింగసముద్రం-2 సచివాలయం

బీసీ మహిళ రిజర్వేషన్ ఖరారుతో అయోమయం

- రిజర్వేషన్ మార్పు సరికాదనే భావనలో ఎమ్మెల్యే
- కొలిక్కిరాని ఏఎంసీ చైర్మన్ అభ్యర్థుల ఖరారు

కావలి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం నియామాల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఆశావహులు కావలి బీసీ మహిళకు రిజర్వేషన్ అయిందన్న ప్రచారంతో నిరాశకు గురిఅవుతున్నారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఇప్పటికే వ్యవసాయ మార్కెట్ కమిటీని దగదర్తి మండలంకు చెందిన పమిడి రవికుమార్ చౌదరికి ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు పార్టీ అధిష్టానం దృష్టికి కూడా ఆయన పేరును పంపారు. ఎమ్మెల్యే చర్యలతో ఆశావహులు సర్దుకున్నారు. అయితే రాష్ట్రంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేయటంతో ఆశావహుల ఆశలపై నీరు చల్లినట్లయ్యింది. ఈ విషయంను పార్టీ అధిష్టానం దృషికి ఎమ్మెల్యే తీసుకెళ్లి అవకాశం ఉంటే రిజర్వేషన్ మార్పుపై చర్చించాలని భావిస్తున్నారు. అయితే ప్రస్తుతం బీసీ మహిళకు కావలి చైర్మన్ పదవి ఖరారు అయినా దానిపై టీడీపీ వర్గాలు ఒక నిర్ణయానికి రాలేదు. బీసీ రిజర్వేషన్ తప్పనిసరి అయితే అప్పుడు ఆశావహులు ఎవరున్నారా అనే విషయం స్పష్టతకు రాదు. వాస్తవంగా కావలి నియోజకవర్గంలో బీసీ సామాజికవర్గంలో మత్స్యకారులు, యాదవులు, గౌడ్‌లు ఎక్కువగా ఉండటంతో బీసీ రిజర్వేషన్ తప్పనిసరి అయితే వారిలో ఏదో ఒక సామాజికవర్గం నుంచి ఆశావహులు బయటకు వచ్చే అవకాశం ఉంది.


కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

సత్తెమ్మకు పాలపొంగళ్లు

కలువాయి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారం గ్రామస్థులు ఆదివారం గ్రామదేవత సత్తెమ్మకు పాలపొంగళ్లు నిర్వహించారు. పాడిపంటలతో గ్రామం కళకళలాడాలని కోరుతూ, ప్రతిఏటా అమ్మవారికి పాల పొంగళ్లు పెట్టుకోవడం ఆనవాయితీ. తొలుత ప్రతి ఇంటి నుంచి మహిళలు కొత్త గంపల్లో నైవేద్యానికి అవసరమైన సామగ్రి తీసుకుని, మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అక్కడ పొంగళ్లు పెట్టుకుని అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, సోమశిల ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వేలూరు కేశవచౌదరి దంపతులు, బీజేపీ వెంకటగిరి ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారి వెంట టీడీపీ నేత గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు, కూటమి నాయకులు ఉన్నారు.


పూలతో అందంగా తీర్చిదిద్దిన అమ్మవారి ప్రతిమ